
**జనవరి 2012**
**సంపుటి 5**
**సంచిక 9**



**ఎడిటర్ & పబ్లిషర్**
**సందిరెడ్డి కొండలరావు**
**కాకానిపాలెం, అద్దంకి.**

Edited & Published and owned by
S. Kondala Rao
**Akhil Publications**
Kakanipalem, ADDANKI
Ph : 08593-223862
Cell : 98485 59566
e-mail : gundlakamma@yahoo.com
gundlakammas@gmail.com

and Printed at
**Saswitha Graphics**
Addanki

Layout & Design
Real image
Ongole
Mobile : 99485 17418

# గుండ్లకమ్మ

**సామాజిక రాజకీయ మాస పత్రిక**

## విషయసూచిక

| | | |
|---|---|---|
| 1. | కళతప్పిన సంక్రాంతి | 2 |
| 2. | మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి | 4 |
| 3. | ప్రతిష్ఠకోసం ప్రాకులాడుతున్న కాంగ్రెస్ | 6 |
| 4. | ప్రజల్లోకి వెళ్ళి వివరిస్తా | 8 |
| 5. | కాంగ్రెస్‌లో చెల్లని కాసు చిరంజీవి | 10 |
| 6. | పర్యావరణ మిత్ర కార్యక్రమం అమలు | 14 |
| 7. | నడవటానికి ఇష్టపడండి | 16 |
| 8. | విశ్వవినువీధుల్లో ఆంధ్రుల ఆడపడచు | 18 |
| 9. | పురంధ్రీశ్వరులకు శుభాకాంక్షలు | 26 |
| 10. | సినిమా | 28 |
| 11. | స్వప్నములు వాటి ఫలితములు | 30 |
| 12. | తిరుక్కుఱళ్ – శ్రీవాణి | 32 |



గుండ్లకమ్మ పాఠకులకు,
ప్రకటన కర్తలకు,
నూతన సంవత్సర మరియు
సంక్రాంతి శుభాకాంక్షలు....
ఎడిటర్ & పబ్లిషర్

ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా తెలుగు పాఠకుల కోసం ఇంటర్‌నెట్‌లో
**"గుండ్లకమ్మ"**
**www.gundlakamma.com**

Owner, Published and edited by S. Kondala Rao published from Kakanipalem, Addanki - 523 201
and Printed at Saswitha Graphics, Opp. Rama Takies Street, Addanki. Editor S. Kondala Rao

# కళ తప్పిన సంక్రాంతి

ప్రజలకు ఆనందాన్ని పంచి, అనుబంధాన్ని, ఆప్యాయతను పెంచేవి పండుగలు. అందునా సంక్రాంతి పల్లెతల్లి పల్లవించిన పెద్దపండుగ. పొలం నుండి తన ఇంటికి చేరిన ప్రతి పంటను, రక్తం పంచుకు పుట్టిన బిడ్డలా కళ్లారా చూచుకొని పొంగిపోయే కర్షకుల పండుగ. మట్టిని పెనవేసుకొని బ్రతుకును నెట్టుకొస్తున్న శ్రామికుల పండుగ ఇది. మార్గశిర పుష్యమాసంలో పంటసిరులను వెంట తెచ్చే ఈ పర్వదినం వృత్తి పన్నుల వారికి, కాపులకు సహజీవనం బంధం అనడంలో అతిశయోక్తిలేదు. పండక్కిముందు నెలనుండి అంటే డిసెంబర్ 14,15 తేదీల్లోనే పండగ నెల పెడతారు. ఇలా నెలరోజుల పాటు పండుగ వాతావరణం గ్రామల్లో అలముకొంటుంది. కానుకల పండుగ, కాపులపండుగ, పొంగళ్ళు పండుగ, వసూళ్ళ పండుగ, మ్రొక్కులు పండుగ అని వివిధ నామాలతో వ్యవహరించడాన్ని బట్టి ఈ పర్వదిన ప్రాముఖ్యం అవగతమౌతుంది. మేషం మొదలు మీనం వరకున్న పన్నెండు రాశుల్లో సూర్యుడు ఒక్కొక్కమాసంలో ఒక్కొక్క రాశిలో పరిభ్రమిస్తాడు. సూర్యుడు ఉత్తర దిశగా ప్రయాణం ప్రారంభిస్తూ మకర రాశిలోకి సంక్రమణం జరుగుతున్న ఈ రోజు మకర సంక్రాంతి. ముక్కోటి దేవతలుండే ఉత్తర దిక్కు అతి పవిత్రమైనదని ఉత్తరాయణంలో పరమపదిస్తే పరమపదం ప్రాప్తిస్తుందనే విశ్వాసం ప్రబలంగా ఉన్నది. దీనికి భీష్మపితామహుని అంత్య వృత్తాంతాన్ని ఉదహరిస్తుంటారు. ఈ ధనుర్మాసంలోనే స్త్రీలు కాత్యాయని వ్రతాలు చేసేవారని, ఈ పుణ్యదినాల్లోనే ఎన్నో మహత్యాలు జరిగినట్లు పురాణాల్లో ఉదహిరంచబడింది. ఈ రోజుల్లో గ్రామదేవత లైన గంగమ్మ, పోలేరమ్మ, నూకాలమ్మ, సంకాలమ్మ వంటి గ్రామ దేవతలకు కొలువుచేసి, ప్రభలుకట్టి, పొంగళ్ళు పెట్టి సిడిమాను ఊరేగించి, వేటల్ని ఊరుచుట్టు తిప్పి వాటిని బలిచ్చి పొలిమేరలు తిరిగివేస్తే ఊరికి కీడురాదని నమ్మకం వుంది. గోదాదేవి తిరుప్పావై సరాగాలై పందిరెక్కింది ఈరోజుల్లోనే కదా. ప్రాచీన, ఆధునిక కవివరేణ్యులెందరో తమ హృదయాలను విరబూసిన ముద్దబంతి, చేమంతి, గుమ్మడిపూలు చేసికొని సంక్రాంతి లక్ష్మిని స్వాగతించారు.

మానవజాతి పరిణామంలో మనిషి నిప్పును కనిపెట్టడం, దాన్ని కనిపెట్టుకొని వుండడం, దాన్నుండి సరిసందల్ని ఆశించడం, తన ప్రగతికి దాన్నొక ప్రధాన సాధనంగా వినియోగించుకోవడం జరిగింది. సంక్రాంతి పండుగ మొదటిరోజైన భోగినాడు వేసే భోగిమంటలపై చరిత్రకొక చురుకైన సాక్ష్యం – చర్మం చురుక్కుమనాలి, చలితోక ముడవాలి. ఈ అనుభూతి ఏడాదిపాటుండాలి గదా మరి. సంక్రాంతి ముగ్గుల్లో కళాత్మకత వెల్లి విరుస్తుంది. గీతలముగ్గు ఆర్యసంప్రదాయమని, ఈ రెంటిని మేళవించడం ఆంధ్రుల సంప్రదాయమని పరిశీలకుల ఉవాచ. సంక్రాంతి లక్ష్మికి,



వైకుంఠపాళి, రథం ముగ్గుల స్వాగతం పలుకుతాయి. ముగ్గుల్లో ముద్దుగుమ్మలు తీర్చిన గొబ్బిళ్లు వాటి పున అలరించిన రంగు రంగుల పూలు ఇంటి ముంగిట క్రొత్త అందాలు సంతరిస్తాయి. గొబ్బిని గౌరీదేవిగా పూజిస్తారు. ఈ గొబ్బిళ్ళను కాలితో తొక్కకుండా, చెదరకుండా భద్రపరచి, ఎండబెట్టి, రధసప్తమినాడు ఆ పిడకల దాలిరాజేసి పొంగలి వండుతారు. సంక్రాంతి కుటుంబ వ్యవస్థకు చక్కని ప్రతీక. తమకు జన్మనిచ్చి తమ సుఖసంతోషాల కొరకు శ్రమించి, తపనపడి, తమను శాశ్వతంగా వదలివెళ్లిన పితృదేవతలను స్మరించుకొంటూ, భక్తిపూర్వక పిండప్రధాన దానాది కర్మకాండలతో తృప్తిపరచడం, తమకు పుట్టిన బిడ్డలు తమ కళ్ళముందే పెరిగి, గృహస్థులౌతుంటే సంబరపడ్తూ కొడుకులను, కోడళ్ళను, కూతుళ్ళను, అల్లుళ్ళను తమ ఇంటికి ఆహ్వానించుకొని, అప్యాయతానురాగాలతో ఉన్నంతలో కానుకలతోను, క్రొత్త బట్టలతోను ఆనందింపచేయడం – మూడోతరం పసివారిని చేరదీసి రాగినాణెములు, రేగుపండ్లు (బదిరి) చెరకుముక్కలు, నానపెట్టిన సెనగలు మొదలగు వాటిని భోగిపళ్ళుగ తలారాపోయడం ఆరోగ్యానికి, అనురాగానికి, గృహస్థ ధర్మాలకి సంకేతాలుగా దర్శనమిస్తాయి. భోగిపండ్లు శిరోభాగం నుండి దేహాన్ని తాకుచూ రావడం ఎదిగే పసినరాలకు ఉపినిస్తుందని విజ్ఞుల అభిప్రాయం.

తమ పశుసంపదను అపురూపంగా చూసుకునే రైతులకు వాటి మనసులు వాటి బాసలు తెలుసు. తమ దగ్గరుండే ఎద్దులను బట్టి రైతులకు సంఘంలో పేరు వస్తుంది. రెండు ఎద్దులకు రామలక్ష్మణులని పేరు పెట్టుకొని పిలుచుకుంటారు. ఏరువాక నుండి ఈ రోజు దాకా తన ఆసామికి సేవలందించి, గాదెలకు ధాన్యాన్ని చేరవేసి, కాడిబరువును మరిచిపోయి నాల్గురోజులు కాస్త నెమరువేసుకొనే నోరులేని మూగజీవాల పండుగ. అందుకే కనుమరోజు రైతులు తమ పశువులను శుభ్రంగా కడిగి అలంకరిస్తారు. ఎద్దులకైతే కొమ్ములకు ఎర్రరంగు, చివర్లో కుప్పెలు, నొసటన పసుపు, కుంకాలు, ముఖపట్టెడ, అద్దాల బొద్దువారు, వీపుల ఉలెన్‌కుచ్చులు, చెండుకి రంగుతాళ్ళు మెడలో గోపల్లెగంటలు, ఊపరానికి చెండు, కాళ్ళకు గజ్జెలు అలంకరించి వాటిపు తమకున్న ఆప్యాయతను, కృతజ్ఞతను చాటుకుంటారు. వ్యవసాయ పరికరాలకు కూడా పసుపు కుంకాలు రాసి దండం పెట్టుకుంటారు. ఎద్దులకు అందాల పోటీలు, బండిలాగుడు పోటీలు నిర్వహిస్తారు. చేపుకున్న తల్లి పొదుగును కమ్మి పాలుతాగి ఆపాలనురుగుతోనే చెంగు చెంగున గంతులు వేసే తువ్వాయిలు, వాటిని పట్టుకోవాలని వాటి తోకల వెంబడి పరుగులు తీసే బుజ్జాయిలు, తమ బిడ్డలకు హానిచేస్తారనుకొని అంభారవాలతో హెచ్చరిస్తూ కట్టుకొయ్యనుండి తల విసిరేగోమాతలు ఈ దృశ్యాలు అనుభవైక వేద్యావేగాని అక్షరాల్లో ఒదగనివి.

కళాత్మకంగా చూడగలిగితే సంకురాతిరి ఏడు రంగుల వరదగుడే ఊరిని నమ్ముకొని బ్రతికే ఎన్నో జానపదకళలు మనకు ఈనెలనాళ్ళు దర్శనమిస్తాయి. ఊరుకళు ్ళనులుముకొనే సమయంలో హరిదాసుల భక్తి సంకీర్తనలు వినిపిస్తాయి. హరిలోరంగహరి అంటూ పాడుతూ తంబుర మీటుతూ, ప్రతిగడప ముందు నిలబడి, గృహస్థులు సమర్పించే భిక్షను, మోకాలిపై వంగి, శిరస్సుపై అమర్చుకున్న రాగికలశంలో స్వీకరించి, ఆశీస్సులు పలుకుతాడు. ఒకప్పుడు ఈ హరిదాసుకి మించిన భక్తి ప్రచారకుడు లేడేమో! ఇక జంగమ దేవరల శంఖ ధ్వానాలు, కోలాటాలు, చెక్కభజనలు నరేనరి – గంగిరెద్దుల విన్యాసాలు అద్భుత కళాత్మకాలు. నోరులేని పశువులు కూడ రామాయణగాధని బోధిస్తాయన్నమాట. చీకటి పడే సరికి రచ్చబండకాడనో, గవిటికాడనో, పోలేరమ్మ గుడిముందటనో తోలుబొమ్మలాట ప్రత్యక్షం–బుర్రకథకులు ఆసాదివారు, గారడివారు పళ్ళెంలాంటి కళ్లెంలో తలా ఒకగింజ ఏరుకొనే పేదకళాకారులు. అన్నం కరువైనా డొక్కశుద్ధి కలిగివారు. గాలిపటాలు, సంక్రాంతి ఆనందాన్ని ఆకాశానిక కూడా తెలుపుతాయి. కోడిపుంజుల పందేలు, పొట్టేళ్ళ పందాలు కాస్త వినోదం – కాస్త విషాదం, పోటీలు పడి కుర్రాళ్ళు తన్నుకోవడం తరచూ జరుగుతుంటుంది.

ఇంతటి సంక్రాంతి నేడు వెలవెలబోతున్నది. ప్రకృతి కరుణించక, చినుకు రాలక కరువుకోరల్లో చిక్కి ఊరు కన్నీరు పెడ్తున్నది. ఎన్ని సంస్కరణలు, ఎన్నికలు వచ్చినా కర్షకుల బ్రతుకు దినదినగండంగా మారిపోతున్నది. మంత్రాలమర్రికిందైనా ఊపిరిపీల్చగలిగాయి గాని, ఈ యంత్రాల దెబ్బకే జీవజచ్చి పోతున్నాయ్ బక్కప్రాణాలు. అయ్యా, అన్నా, అప్పా, మావ, బావా అనే కలుపుగోలు మాటలు, ఊళ్ళలో కలికాలానికి కూడా కన్పించకుండా పోతున్నాయ్. రాజకీయాలకైపు ఎక్కువై, పరస్పర ద్వేషాలతో గ్రామలు సంగ్రామ భూములై పోతున్నాయ్. పండుగ దండగ మారిదంయింది. ఒకనాడు పండుగ పూట వెలిగిన చిరమట్టి ప్రమిదలు సాధించిన సాంస్కృతిక ఏకత్వాన్ని ఈనాడు వేలవేల ఎలక్ట్రిక్ బల్బుల ఫోకసింగులు సాధించలేకపోతున్నాయ్. ప్లాస్టిక్ పూలు, ప్లాస్టిక్ గొబ్బిమ్మలు, హలో, హ్యాపీ పొంగల్స్ వచ్చాయ్. పండుగ కళ తప్పుతున్నది. సంక్రాంతి లక్ష్మీపాదం మోపడానికి సంకోచిస్తున్నది. సమాజంలో సహజీవనాన్ని సమభావాన్ని, సంతోషాన్ని, సౌందర్యాన్ని సాధించడానికి సోపానమై శుభసంక్రాంతిని ఆహ్వానిద్దాం రండి. కాస్త చల్లని పైరుగాలిని పంచుకొందాం రండి...

రచన – **డా॥ యు. దేవపాలన,**
రిటైర్డ్ ఆర్జేడీ

❄ ❄ ❄ ❄ ❄

# మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు

**- గొట్టిపాటి రవికుమార్**



అద్దంకిలో మంచినీటి సరఫరాకు శాశ్వత పరిష్కారం కోసం పలు ప్రాంతాలను ఎమ్మెల్యే రవికుమార్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ అంకయ్య సోమవారం పలు ప్రాంతాలను పరిశీలించారు. మంచినీటి సరఫరా మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలు, నీటి వనరుల లభ్యతను ఎస్ఈ అంకయ్య పరిశీలించారు. పట్టణం విస్తరిస్తున్నందున అదనంగా ఓవర్ హెడ్ ట్యాంకులను ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ఎస్ఈ దృష్టికి ఎమ్మెల్యే తీసుకువచ్చారు. ప్రధానంగా ఎన్‌టీఆర్ నగర్ ప్రాంతంలో నూతన ఓవర్ హెడ్ ట్యాంక్ ఏర్పాటు, నగర పంచాయతీ కార్యాలయం ఆవరణలో దెబ్బతిన్న ఓవర్‌హెడ్ ట్యాంకు స్థానం లో కొత్త ట్యాంకు ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. ప్రస్తుతం పట్టణానికి నీరు సరఫరా జరుగుతున్న గుండ్లకమ్మలోని ఊట బావుల ప్రాంతాన్ని పరిశీలించారు. పట్టణంలో గతంలో వేసిన పైపు లైన్లు అస్తవ్యస్తంగా ఉండటంతోపాటు తక్కువ సైజులో ఉండటంతో శివారు ప్రాంతాలకు సక్రమంగా నీటి సరఫరా జరగడం లేదని ఎస్ఈకి వివరించారు. ప్రస్తుతం నగర పంచాయతీ కార్యాలయంలో శిధిలావస్థకు చేరిన మంచి నీటి ట్యాంకు ఫిల్లర్ల మరమ్మతులకు చర్యలు తీసుకోనున్నట్లు ఎస్ఈ తెలిపారు.

వీరి వెంట నగర పంచాయతీ కమీషనర్ వెంకట కృష్ణయ్య, మేనేజర్ పాటిబండ్ల వీరాంజనేయులు, కందుకూరు పబ్లిక్ హెల్త్ డీడీ రహంతుల్లా జానీ, మాజీ జడ్పీటీసి సభ్యుడు సందిరెడ్డి శ్రీనివాసరావు, పీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ సందిరెడ్డి రమేష్, కరి పరమేష్, చెన్నుపల్లి వెంకటేశ్వర్లు, నర్రా నాగేశ్వరరావు, కొమ్మాలపాటి బ్రహ్మేశ్వరరావు, చుండూరి మురళి తదితరులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలి**

అంగన్‌వాడి కేంద్రాలను ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తూ సక్రమంగా నిర్వహించాలని ఎమ్మెల్యే రవికుమార్ సూచించారు. మంగళవారం స్థానిక ఆర్ అండ్ బి బంగ్లాలో పలు శాఖల అధికారులతో సమీక్షించారు. ప్రధానంగా ఎక్కువ గ్రామాల్లో అంగన్ వాడి కేంద్రాల తలుపులు కూడా తెరవడం లేదని, అధికారులు కూడా పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని సీడీపివో విజయకుమారిపై ఎమ్మెల్యే రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు సందర్భాలలో చెప్పినప్పటికీ తీరు మార్చుకోకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్ వాడీ కేంద్రాలు పని చేసే సమయాలను అడిగి దగ్గరలో ఉన్న కేంద్రాలను తనిఖీకి వెళ్దామని ఎమ్మెల్యే అడగడంతో అధికారులు నీళ్ళు నమిలారు. దీనిని బట్టే వాటి పనితీరు ఇట్టే అర్థమౌతుందన్నారు. శింగరకొండ సమీపంలో నిర్మించనున్న 132 కె.వి సబ్ స్టేషన్ సంక్రాంతి తరువాత శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈ పరబ్రహ్మం వివరించారు. రాజీవ్ కాలనీ సమీపంలో నిర్మించతలపెట్టిన 33/11 సబ్‌స్టేషన్ పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. అద్దంకి పట్టణంలోని గరటయ్య కాలనీలో విద్యుత్ స్థంభాలు ఏర్పాటు వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

ఇళ్ళ స్థలాల సమస్యలపై తహశీల్దార్ ప్రభాకరరావుతో చర్చించారు. వేలమూరి పాడులో ఉపాధి పనులు సక్రమంగా జరగడంలేదని ఫిర్యాదులు రాయడంతో పరిశీలించాలని ఎంపీడీవో సాంబశివరావుకు సూచించారు.

**పార్టీ పటిష్ఠతకు సహకరించాలి.**

అద్దంకి నియోజకవర్గంలో యూత్ కాంగ్రెస్, ఎస్‌సీ సెల్ విభాఆల పటిష్ఠతకు సహకరించాలని ఆయా విభాగాల ప్రతినిధులు ఎమ్మెల్యే రవికుమార్‌ను బంగ్లాలో కలసి కోరారు. నియోజకవర్గంలో యూత్ కాంగ్రెస్ తరుపున ప్రతినిధిని నియమించడంతోపాటు 216 బూత్‌లలో సుమారు 5 వేలమంది సభ్యులను చేర్పించేందుకు సహకరించాలని బాపట్ల ఎంపీ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ప్రతినిధి విజయభాస్కర్ ఎమ్మెల్యేతో చర్చించారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ ఎస్‌సీ సెల్ అధ్యక్షులు వేమా శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు శ్రీపతి ప్రకాశం, శేషయ్య, రగ్గరాజు తదితరుల నియోజకవర్గంలో ఎస్‌సీ సెల్ విభాగాల ఏర్పాటుతోపాటు ఆయా సామాజిక వర్గాలను పార్టీ పట్ల ఆకర్షితులను చేసేందుకు తీసుకోవలసిన చర్యలు చర్చించారు. నర్రావారిపాలెంలో ఇటీవల మృతి చెందిన నర్రా శివమ్మ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. అద్దంకిలోని పలు ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు రవికుమార్‌ను కలసి అనుమతి లేకుండా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సూచించాలని కోరారు.

# అందరూ చదవాలి - అందరూ ఎదగాలి
# అనే లక్ష్యసిద్ధి కోసం 2011-12
# రాజీవ్ విద్యా మిషన్ సాగించిన కృషి


**డి.వి. రామ్ మోహనరావు,**
ప్రాజెక్టు అధికారి
రాజీవ్ విద్యామిషన్
పశ్చిమగోదావరి జిల్లా.


రాజీవ్ విద్యామిషన్
సర్వశిక్షా అభియాన్
అందరూ చదవాలి... అందరూ ఎదగాలి....



**శ్రీమతి జి. వాణి మోహన్**
కలెక్టర్, పశ్చిమగోదావరి జిల్లా.

## సర్వశిక్ష అభియాన్ విద్యాభివృద్ధి కొరకు చేపడుతున్న కార్యక్రమాలు

★ రాజీవ్ విద్యామిషన్ (ఎస్.ఎస్.ఎ) క్రింద 2011-12 సం॥లలో అమలు చేసిన కార్యక్రమాల నివేదిక

★ 2011-12 సం॥లో ప్రతిపాదించిన 174.08 కోట్లకు గాను 166.41 కోట్లకు బడ్జెట్ ఆమోదించడం జరిగినది.

★ పాఠశాల గ్రాంట్ 197.35 లక్షలు, పాఠశాల నిర్వహణ గ్రాంట్ 206.35 లక్షలు, పాఠశాల సముదాయ గ్రాంట్ 68.58 లక్షలు, మండల రిసోర్స్ సెంటర్ గ్రాంట్ 46.00 లక్షలను ఈ ఆర్థిక సం॥లో పాఠశాలల విద్యాభివృద్ధికై విడుదల చేయడం జరిగినది.

★ ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం అమలు పరంగా ఈ సంవత్సరం 971 అదనపు తరగతి గదులు, 16 మండలాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకై రిసోర్స్ సెంటర్లు, 754 బాలికలకు టాయిలెట్స్, 700 ర్యాంపుల నిర్మాణమునకై 60.55 కోట్లు కేటాయించబడినవి.

★ విద్యా పక్షోత్సవాలలో భాగంగా 60906 పిల్లలను 1వ తరగతిలోను 62472, 54954 పిల్లలను 6వ, 8వ తరగతులకు ట్రాన్సిషన్ చేయడం జరిగినది. 759 మంది బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించడం జరిగినది.

★ జిల్లాలో 3972 బడిబయట పిల్లలను గుర్తించడం జరిగినది. వీరి కొరకై 10 ఆర్ ఎస్.టి.సి.లు మరియు ఎన్.ఆర్.ఎస్.టి.సి.లు ఏర్పాటు వలస కార్మికుల పిల్లకై 11 వర్క్ సైట్ స్కూల్స్, 1 సీజనల్ హాస్టల్ ఏర్పాటు జరిగినది. వీటికై 4.72 కోట్లు కేటాయించుట జరిగినది.

★ ఇంతవరకు 159428 పిల్లలకు ఉచిత యూనిఫామ్స్ అందజేయడం జరిగినది. 2011-12 లో ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం అమలులో భాగంగా జిల్లాలో 248584 మంది బాలబాలికలకు 2 జతల యూనిఫామ్స్‌కై 9.94 కోట్లు కేటాయించడం జరిగినది.

★ జిల్లాలో గుర్తించబడిన 10291 ప్రత్యేక అవసరాలు గల పిల్లలకై38 మంది రిసోర్స్ పర్సన్ల నియామకం జరిగినది. 229 కరెక్టివ్ సర్జరీలు 648 ఉపకరణాల పంపిణీ మరియు 10 మంది ఫిజియో థెరపిస్టులచే ప్రతి మండలములో 2 సార్లు క్యాంపుల నిర్వహణ మొదలగు కార్యక్రమాల నిమిత్తం 2.68 కోట్ల కేటాయింపు జరిగినది.

★ జిల్లాలో విద్యా స్థాయి పెంపుదలలో భాగంగా 1వ తరగతిలో ఇంగ్లీష్ పాఠ్యపుస్తకం ప్రారంభించుట జరిగినది. 1,2,3 తరగతులలో స్నేహ బాల కార్యక్రమం, 3వ తరగతి పిల్లలకు ఇంగ్లీష్‌లో స్లిమ్ కార్డ్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ కార్డులు, సంసిద్ధతా కార్డులు మరియు ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమమునకై 5.52 లక్షలు కేటాయింపు జరిగినది. జిల్లాలో ఎల్.ఇ.పి. అమలు పరిశీలన నిమిత్తం బాహ్య మూల్యాంకనం నిర్వహించి, మండలానికి 6 పాఠశాలలో పరీక్షలు నిర్వహించడం జరిగినది. జూన్ నెలలో ప్రాథమిక ఉపాధ్యాయులకు 8 రోజులు ప్రాథమికోన్నత ఉపాధ్యాయులకు 6 రోజులు వృత్యంతరశిక్షణ నివ్వడం జరిగినది.


★ 139 పాఠశాలలకు 5 కంప్యూటర్లు చొప్పున పంపిణీ చేసి కంప్యూటర్ ఎయిడెడ్ లెర్నింగ్ కార్యక్రమము ద్వారా పాఠశాల పిల్లలకు బోధన జరుగుచున్నది.


★ ఇప్పటివరకు 330 మంది ఉపాధ్యాయులకు ఈ విద్యాసంవత్సరంలో కంప్యూటర్ ఎయిడెడ్ లెర్నింగ్ పై డైట్ దూబచర్లలో శిక్షణ ఇవ్వడం జరిగినది.

★ రాబోవు ఆర్థిక సంవత్సరంలో రాజీవ్ విద్యామిషన్ ద్వారా అమలుచేయు కార్యక్రమములకై బడ్జెట్ రూపకల్పన నిమిత్తము స్కూల్ డెవలప్‌మెంట్ ప్లాన్, హేబిటేషన్ ప్లాన్, మండల ప్లాన్స్ రూపకల్పనకై పాఠశాల నిర్వహణా కమిటీ సభ్యులకు శిక్షణను ఇవ్వడం జరిగినది. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టంపై మండల విద్యాశాఖాధికారులు, హైస్కూల్ ఉపాధ్యాయులు 6103 మంది జడ్‌పిటిసిలు ఎమ్‌పిటిసిలు సర్పంచ్‌లు వార్డు మెంబర్లు ఒకరోజు శిక్షణా కార్యక్రమం జరుపబడినది.

★ జిల్లాలో గుర్తించిన 8 పట్టణములలో 70 మోడల్ క్లష్టర్ పాఠశాలలో జాతీయ బాలికల విద్యాపథకంలో, 210 వృత్తి విద్యావాలంటీర్లను నియమించుట మరియు 46 మండలములలో ఎంపిక చేసిన 181 పాఠశాలల్లో 181 మంది వృత్తి విద్యా వాలంటీర్లను నియమించుట, ఆయా కోర్సులలో బాలికలకు శిక్షణ ఇవ్వబడును.

# ప్రతిష్ఠకోసం ప్రాకులాడుతున్న కాంగ్రెస్






కాంగ్రెస్ రాష్ట్రంలో కోల్పోతున్న తన ప్రతిష్టను కాపాడుకునే యత్నంలో పడింది. అయితే అదంత తేలికైన విషయమైతే కాదు. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఏఐసీసీ ఇంఛార్జి గులాం నబీ ఆజాద్ కాంగ్రెస్ పరిస్థితిని చక్కదిద్దగలడనే ఉద్దేశ్యంతో ఆయనను అధిష్టానం రంగంలోకి దింపింది. ఆయన బాధ్యతలు స్వీకరించి ఆరు నెలలు దాటుతున్నా కాంగ్రెస్ ప్రతిష్ట ఇనుమడిస్తున్న దాఖలాలైతే రాష్ట్రంలో కనిపించడం లేదు. అవిశ్వాస తీర్మానం గండం గట్టెక్కి కాంగ్రెస్ ప్రభుత్వం నిలదొక్కుకుంది కానీ పార్టీ ప్రతిష్ఠ మాత్రం దిగజారకుండా ఆపే పరిస్థితి మాత్రం లేదు. 2009 ఎన్నికల్లో రెండో సారి దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి కాంగ్రెస్‌ను గెలిపించి అధికారంలోకి తెచ్చినపుడు పటిష్ట స్థితిలో కనుపించింది. ఆయన మరణం తరువాత నుంచీ వరుసగా పరిణామాలన్నీ అవలోకిస్తే కాంగ్రెస్ పార్టీ ఉనికే ప్రమాదం అన్న స్థాయిలోకి పరిస్థితి దిగజారింది. 2009 ఎన్నికల నాటి ఆత్మ విశ్వాసం కాంగ్రెస్ రాష్ట్ర నేతల్లో కొరవడింది. ఇపుడేమో ఏ ఎన్నికలు జరపాలన్నా, ఎదుర్కోవాలన్నా వారు భయపడుతున్నారు. ప్రాంతీయ ఉద్యమాలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తలనొప్పుల ఫలితంగా అడపాదడపా వస్తున్న ఉప ఎన్నికలను ఎదుర్కొనలేని పరిస్థితిని కొంత అర్ధం చేసుకోగలిగినా రాజ్యాంగ నియమాలకు లోబడి జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికల ఊసు కూడా ఎత్తకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. కాంగ్రెస్ పార్టీని అంతర్గత విభేదాలు కూడా కుంగదీస్తున్నాయి. ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమారరెడ్డికీ, పీసీసీ అధ్యక్షుడు బొత్స సత్యనారాయణకు అసలు పొసగడం లేదు. ముఖ్యమంత్రి పీఠాన్ని కాపాడుకోవడానికి కిరణ్ అదే పదవిలో కూర్చోవడానికి బొత్స తపన పడుతూ ఉండడమే విభేదాలకు ప్రధాన కారణంగా నిలిచింది. వీరిద్దరి మధ్య పోరులో వర్గాలకు అతీతులముగా తమను పదవి వరిస్తుందేమోనని మాజీ పీసీసీ అధ్యక్షుడు డి. శ్రీనివాస్, మంత్రులు కె.జానారెడ్డి, జె.గీతారెడ్డి, ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనరసింహ పొంచి కూర్చున్నారు. అవకాశం దొరికినప్పుడల్లా వీరు పరోక్షంగా కిరణ్, బొత్స మధ్య ప్రచ్ఛన్న యుద్ధానికి ఆజ్యం పోస్తూ కూర్చున్నారు. రాష్ట్ర అసెంబ్లీకి 2014 లో నిర్ణీత సమయానికి లేదా అంతకు ముందు ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశం ఎంతమాత్రం లేదని వీరంతా అంతరంగిక చర్చల్లో అంగీకరిస్తున్నవారే. అధికారం ఉండేది మహా అయితే ఇక రెండేళ్లే కనుక ఈ లోపే ముఖ్యమంత్రి పదవిలో కూర్చోవాలన్న ఆరాటం సీనియర్లందరికీ కలగడమే గొడవలకు ముఖ్యకారణం అని చెప్పోచ్చు. వై.ఎస్. జీవించి ఉన్నంతకాలం ఆ కుర్చీ వైపు చూడటానికి కూడా సాహసించని వారంతా ఇప్పుడు క్యూలో నించుని ఉన్నారు. ఏ మాత్రం కష్టపడకుండా కేవలం ఢిల్లీ స్థాయిలో పైరవీ చేసి ముఖ్యమంత్రి పీఠాన్ని కిరణ్ అధిష్ఠించిన తరువాత తాము కూడా అదే బాటలో పయనించాలని భావిస్తూ ఉండటమే కాంగ్రెస్‌లో గందరగోళానికి కారణం అవుతోంది. రాజకీయ సమస్యలు అధిగమించలేని పరిస్థితులలో ఉన్న కిరణ్ సర్కారు సంక్షేమ పథకాలు ఎంత బాగా అమలు చేస్తున్నట్లు ప్రచారంచేసుకుంటున్నా సామాన్యుల చెవికి మాత్రం అది ఎక్కడం లేదు. ప్రభుత్వం ఉన్నా లేనట్టేనన్న స్పృహలో ఉన్న ప్రజలపై కాంగ్రెస్‌కు ఆజాద్ చేస్తున్న కాయకల్ప చికిత్స ఏమాత్రం ప్రభావం చేపడం లేదు. అందుకే సాధ్యమైనంత ఎక్కువ కాలం రాష్ట్రంలో ఎలాంటి ఎన్నికలూ జరక్కుండా చూసుకునే దిశగా కాంగ్రెస్ పెద్దలు ఆలోచిస్తున్నారు. రాష్ట్రం మొత్తం మీద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ప్రభావం తీవ్రస్థాయిలో ఉంది.సీమాంధ్ర ప్రాంతంలో ఆయనకు జనం జేజేలు పలుకుతూ ఉన్నారు. తెలంగాణలో సీమాంధ్రలో ఉన్నంత ఊపు లేకపోయినా జగన్ ఎంతో కొంత ప్రభావితం చేసే స్థితిలో ఉన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ టీఆర్.ఎస్ నుండి పెనుసవాలును ఎదుర్కొంటోంది. ఎన్నికలు ఎప్పుడొచ్చినా కాంగ్రెస్‌కు భారీ నష్టం వాటిల్లుతుందనే అంచనా కొంతకాలంగా ఉంది. అయితే

అసెంబ్లీ ఎన్నికల కంటే ముందుగా స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే అటుగానీ, ఇటు గానీ ప్రజలు ఒకసారి జగన్‌కూ, టీఆర్ఎస్‌కూ ఓట్లేస్తారనీ అంతటితో ఓటర్ల ఉత్సాహం ముగిసిపోతుందనీ కిరణ్‌నమ్ముతున్నట్లుగా తెలుస్తోంది. ఒకసారి ఏదో ఒక ఎన్నికల్లో ఓటేశాక అసెంబ్లీ ఎన్నికల్లో రెండోసారి జగన్‌కు ఓట్లేయరని, అపుడు కాంగ్రెస్




గెలుపొందుతుందనీ ఆయన సూత్రీకరిస్తున్నట్లు సమాచారం. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఆయనకు అతరంగికులుగా ఉంటూ ఇపుడు కిరణ్‌కు సన్నిహితులైన కొందరు పెద్ద మనుషులు కిరణ్‌కు ఈ విధంగా చెప్పినట్లు సమాచారంగా ఉంది. అందువల్లనే ఆయన స్థానిక ఎన్నికలకు తెర లేపుతున్నారని తెలుస్తోంది. ఒకసారి స్థానిక ఎన్నికల్లో జగన్‌కూ, టీఆర్ఎస్‌కూ జనం ఓట్లేశాక మళ్లీ వారికి ఓట్లేయబోరనేది ఎంత నమ్మదగిన అంచనా అనేది కాలమే నిర్ణయించాల్సి ఉంది. అనుభవజ్ఞులకు కొదవ లేదని పార్టీగా పేరున్న కాంగ్రెస్ ఈ విషయంలో చేస్తున్న ఆలోచనలు ఎంత హేతురహితంగా ఉన్నాయో నవ్వు తెప్పిస్తుంది. అసలు ఇలాంటి ఆలోచనలు చూస్తే ప్రజలు అసలు వివేచనాపరులే కాదని కాంగ్రెస్ భావిస్తున్నట్లుగా అనిపిస్తుంది. సాధ్యమైనంత వరకూ అందరినీ వెంట తీసుకునే నాయకత్వం లేమి కాంగ్రెస్‌లో కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. ఏక నాయకత్వంతో పటిష్టంగా ఉన్న టీడీపీని ఎదుర్కొవాలంటే కాంగ్రెస్‌కూ అదే స్థాయి గల నాయకుడు కావాలి. కాంగ్రెస్‌లో నెలకొన్న అసమ్మతి రాజకీయాలు, పరస్పరం ఢిల్లీకి వెళ్లి చాడీలు చెప్పుకునే సంస్కృతి మధ్య ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.

తెలుగుదేశం ఆవిర్భవించక ముందు కాంగ్రెస్ రాష్ట్రంలో ఏక ఛత్రాధిపత్యంగా రాష్ట్రాన్ని ఏలింది. అప్పట్లో గెలిచినా ఓడినా అది కాంగ్రెస్‌గానే ఉండేది. 1982 తరువాత చోటు చేసుకున్న విప్లవాత్మక మార్పుల్లో కాంగ్రెస్ ఇష్టానుసారం వ్యవహరించే పరిస్థితి తలెత్తింది. 1978–82, 1989–94 మధ్యకాలంలో ఏలాంటి పరిస్థితులైతే రాష్ట్రంలో నెలకొన్నాయో ఇపుడూ రాష్ట్రంలో క్రమంగా అదే పునరావృతం అవుతోంది.

రాష్ట్రంలో కుమ్ములాటలు, వర్గ పోరాటాలతో సతమతమైన ప్రతీసారీ కాంగ్రెస్ ఆ తదుపరి జరిగే ఎన్నికల్లో గెలవలేదు. 94 లోనూ, అంతకు ముందు 82లోనూ అదే జరిగింది. ఇపుడూ అదే జరుగబోతోంది. 94లో ఎన్నికలకు ముందే ఒకప్పటి మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు బంగారు పళ్లెంలో పెట్టి ఎన్టీఆర్‌కు అధికారం అప్పగిస్తారని జోస్యం చెప్పారు. అపుడదే నిజమైంది. ఇపుడూ అదే నిజం కాబోతోందనేది ఎవరూ కాదనలేని సత్యం. కాంగ్రెస్ అధికారం కోల్పోతే లాభపడే స్థితిలో కూడా టీడీపీ లేకపోవడం రానున్న ఎన్నికల విశేషంగా చెప్పుకోవచ్చు. కానీ టీడీపీ, వైఎస్సార్ కాంగ్రెస్ రెండూ అధికారపక్షాన్ని తమ ప్రధాన ప్రత్యర్థిగా భావించడం లేదు. బాబు, జగన్ మధ్యే వచ్చే ఎన్నికల్లో ప్రధాన పోటీ తలెత్తుతుంది. తెలంగాణలో ఇప్పటికే ప్రథమ స్థానంలో ఉన్న టీఆర్ఎస్ ఈ రెండు పార్టీలకూ సవాలు విసురుతోంది. అక్కడ తెలంగాణ ఆకాంక్ష ప్రజల్లో తగ్గుతోందనే ప్రచారంలో నిజం లేకపోయినా ప్రత్యేక రాష్ట్రం ఇప్పట్లో ఇక రాదనే భావన ప్రజలకు కలుగుతోంది. అదే మేరకు జగన్‌కు లేదా టీడీపీకి ఉపయోగపడుతుందనేది ఇంకా వేచి చూడాల్సి ఉంది. ఆ ప్రాంతంలో టిడిపి ఇప్పటికే తన పట్టును బాగా కోల్పోయింది. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు కూడా మళ్లీ పార్టీ టికెట్‌పై పోటీ చేయడం ఎలా! అనే మీమాంసలో కూడా ఉన్నారు. రెండేళ్ళకు పైగా ఈ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తత, ఆందోళనల కారణంగా చంద్రబాబు, జగన్ పర్యటించాలంటే జంకారు. తన తండ్రి చనిపోయిన అనంతరం తట్టుకోలేక మృతి చెందిన కుటుంబాలను ఓదార్చాలనే కారణంతో తెలంగాణలో అడుగు పెట్టాలని 2010 మే నెలలో ప్రయత్నించిన జగన్‌కు మహబూబాబాద్ (వరంగల్)లో చుక్కెదురైంది. ఫలితంగా జగనను తెలంగాణకు వెళ్లలేక



పోయారు. ఆయన చాలా కాలం ఓర్పుగా ఎదురు చూసి చివరకు ఈ నెల 10వ తేదీన రైతు దీక్ష పేరుతో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు వెళ్ళగలిగారు. ఆయన పర్యటన విజయవంతం కావడం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మంచి ఊపునిచ్చింది. జగన్ నిజామాబాద్‌కు వెళ్లిన సందర్భంగా పెద్దగా నిరసనలు ఎదురుకాలేదు. అంతకు కొద్దిరోజుల ముందే చంద్రబాబు పంతంతో వరంగల్ పర్యటనకు విజయవంతంగా వెళ్లి వచ్చారు. వీరిద్దరి పర్యటనలతో ఇక తెలంగాణలో అందరూ స్వేచ్ఛగా కాక పోయినా ఇబ్బందులేమీ లేకుండా పర్యటించే వాతావరణం ఏర్పడింది. ఇక మళ్లీ అక్కడ అన్ని పార్టీలూ తమ కార్యక్రమాలు నిర్వహించే పరిస్థితి ఏర్పడింది. 2009 నుంచీ రాష్ట్రంలో, ముఖ్యంగా తెలంగాణలో ఆ ప్రాంతేతర నాయకులు తిరిగే అవకాశం లేకపోయినా 2012 లో అందరూ తిరగగలిగే స్థితి రావడం ఒక శుభపరిణామమే! అని చెప్పక తప్పదు. ఇక రాబోయే ఉప ఎన్నికల వల్ల మళ్లీ రాష్ట్రంలో కొంత అస్తవ్యస్త వాతావరణం ఏర్పడే అవకాశం ఉన్నప్పటికీ సాధారణ ఎన్నికలు పూర్తయ్యే నాటికి అది కుదుట పడుతుందని చెప్పక తప్పదు.

# ప్రజల్లోకి వెళ్లి వివరిస్తాం

*— సుచరిత మేకతోటి*



**కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా ఎన్నికై - జగన్ వర్గంలో చేరి - అవిశ్వాస తీర్మానం సమయంలో పార్టీ విప్‌ను ధిక్కరించి జగన్ ఆదేశాల ప్రకారం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసి 'వేటు' జాబితాలో ఉన్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే శ్రీమతి మేకతోటి సుచరితతో జరిపిన ఇంటర్వ్యూ :**

ప్రశ్న : వైయస్సార్ పార్టీ టిక్కెట్ మీకు ఖాయమైనందుకు అభినందనలు

సుచ : థ్యాంక్స్

ప్రశ్న : వైయస్సార్ పార్టీకి మీ జిల్లాలో ఆదరణ ఎలా ఉంది?

సుచ : చాలా బాగుంది. మేము రైతు సమస్యల మీద పోరాడుతూ విప్‌ను ధిక్కరించాం. ప్రజలు మమ్మల్ని అర్థం చేసుకుంటారు.

ప్రశ్న : తెలుగుదేశం పరిస్థితి ఎలా ఉంది?

సుచ : ఆ పార్టీని జనం నమ్మే స్థితి లేదు.

ప్రశ్న : చిరంజీవి చేరికలో కాంగ్రెస్‌కు బలం పెరిగిందంటారా?

సుచ : చిరంజీవి పదవులకోసం కాంగ్రెస్‌లో చేరాడని జనానికి తెలుసు. ఆయనకి తిరుపతిలో బలం లేదు. ఇక ఆయన వల్ల కాంగ్రెస్‌కు బలం ఏముంటుంది? మొన్న కడప, పులివెందుల ఎన్నికలలో ఆయన శక్తి చూశాం కదా.

ప్రశ్న : మీ రాజీనామాల ఆమోదం ఎంతవరకు వచ్చింది?

సుచ : బంతి వాళ్ళ కోర్టులో ఉంది.

ప్రశ్న : అదికాదు. అందరిముందు స్పీకర్ సాక్షిగా విప్ ధిక్కరించారు. మీ మీద వేటు వెయ్యడానికి ఎందుకు ఆలస్యం?

సుచ : అది వాళ్ళకే తెలియాలి. మమ్మల్ని చూసి వారు భయపడుతున్నారు.

ప్రశ్న : మీ మీద చర్య తీసుకోకపోతే మీరు ఏం చెయ్యగలరు?

సుచ : వేటు వెయ్యమని ఒత్తిడి తెస్తాం.

ప్రశ్న : మీరు ఎంత ఒత్తిడి తెచ్చినా వేటు వెయ్యరు. మరో సంవత్సరమో, రెండు సంవత్సరాలో అలాగే పెండింగ్‌లో పెడతారు. అప్పుడు మీరు ఏం చెయ్యగలరు?

సుచ : జనంలోకి వెళ్ళి మేం ఎందుకు రాజీనామా చేశామో చెబుతాం.

ప్రశ్న : మీరెందుకు రాజీనామా చేశారో జనానికి తెలుసు గదా! వారికి చెప్పి ఏం లాభం ?

సుచ : మరేం చెయ్యాలో సలహా ఇవ్వండి.

ప్రశ్న : నేను సలహా ఇవ్వడం కాదు. మీ అయిడియా ఏంటో చెప్పండి. మీ పార్టీలో ఈ పాయింటు మీద ఏమైనా చర్చ జరిగిందా?

సుచ : ఇంతవరకు లేదు. ఈ సారి చర్చిస్తాం. మేం ఈసారి పెద్ద మెజార్టీతో గెలుస్తామనే వారు మా రాజీనామాలను ఆమోదించడం లేదు.

ప్రశ్న : మీలో చాలామంది గెలుస్తారనే దాని మీద సందేహం లేదు. అసలు ఎన్నికలంటూ జరపాలికదా?



రాబోయే రెండు సంవత్సరాల వరకూ అసలు మీ మీద వేటు వెయ్యరనుకుందాం. అప్పటి వరకు మీరు పేరుకు ఎమ్మెల్యేలే. కానీ పనులు జరగవు.

సుచ : అవును. ఇప్పటికే మా పనులు చెయ్యద్దని అధికారులను బెదిరిస్తున్నారు. ఈ విషయాలన్నీ ప్రజలకు వివరిస్తాం.

ప్రశ్న : అది సరే మేడమ్... మీ రాజీనామాల సంగతి చెప్పండి. మీ రాజీనామాలు ఆమోదించరు. వేటు వెయ్యరు. పనులు చెయ్యరు. మిమ్మల్ని సతాయిస్తుంటారు. దీన్ని ఎలా ఎదుర్కోవాలనుకుంటున్నారు? మీ ప్లాన్ ఏంటి?

సుచ : (కొంచెం అయోమయంలో పడి) అదీ నిజమే. మా పార్టీలో చర్చిస్తాం.

ప్రశ్న : మీ రాజీనామాలను ఎందుకు పెండింగ్‌లో పెడుతున్నారో నన్ను చెప్పమంటారా?

సుచ : చెప్పండి.

ప్రశ్న : బాగా లేట్ అయ్యే కొద్ది విసుగెత్తి మీలో కొందరైనా మనసు మార్చుకుని తిరిగి పార్టీ లోకి వస్తారని వారికి ఆశ ఉండొచ్చు కదా?

సుచ : అలా ఎవరూ వెళ్ళరు.

ప్రశ్న : అలా ఎలా చెప్పగలరు? మొన్నటిదాకా సత్యవతి, జయసుధల గురించి అలాగే అనుకున్నారంతా. మీలో కొందరైనా అలా మనసు మార్చుకోరని గ్యారంటీ ఏముంది?

సుచ : లేదు, లేదు అలా జరగదు.

ప్రశ్న : మరో కారణం కూడా ఉందని తెలిసింది. ఒకవేళ నాలుగైదు మాసాల తరువాత చిరంజీవి మళ్ళీ అలిగి వెళ్ళి పార్టీని పునరుద్ధరించే పక్షంలో మీలో కొందరన్నయినా తమ వైపుకు తిప్పుకోవచ్చనే ఆశతో మీ రాజీనామాలను పెండింగ్‌లో ఉంచొచ్చు కదా?

సుచ : (కొంచెం కంగారుగా) ఈ విషయం నాకు తెలియదండి.

ప్రశ్న : మీ రాజీనామాలను ఇన్ని రోజుల్లోగా ఆమోదించాలని నిబంధనేదైనా ఉందా?

సుచ : అలాంటిదేం లేదండి.

ప్రశ్న : ఎన్నికలు మరో రెండేళ్ళలో ఉన్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికలతో పాటు మన ఉప ఎన్నికలు జరగడం లేదు. 2013 డిసెంబరు దాకా మీ రాజీనామాలను పెండింగ్‌లో పెట్టి అప్పుడు ఆమోదిస్తే ఉపఎన్నికలు జరపాల్సిన అవసరం కూడా ఉండదు. అప్పుడు మీరు ఏం చేస్తారు?

సుచ : జనంలోకి వెళ్ళి చెప్పడం తప్ప ఏం చెయ్యగలం? మీరు చెప్పండి ఏం చెయ్యాలో?

ప్రశ్న : అసెంబ్లీ ముందు నిరాహారదీక్షలు చేస్తారా?

సుచ : అవసరమైతే చేస్తాం. పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

ప్రశ్న : మీ జిల్లాలో మీ పార్టీలో బలమైన నాయకులు ఎవరున్నారు? జనం సానుభూతితో గెలిపించాల్సిందే తప్ప వారిని ఒప్పించగలిగే నాయకులు మీ పార్టీలో ఏరి?

సుచ : మాకినేని పెద రత్తయ్య గారున్నారు. ఇంకా కొందరున్నారు.

ప్రశ్న : పెదరత్తయ్య గారు అటూ ఇటూ ఊగుతున్నారని విన్నాం.

సుచ : లేదు. ఆయన మాతోనే ఉంటారు. ఎప్పుడు ఉప ఎన్నికలొచ్చినా భారీ మెజారిటీతో గెలుస్తాం.

ప్రశ్న : రాజీనామాలు ఆమోదించిన తరువాత కదా ఎన్నికల సంగతి?

సుచ : స్పీకర్‌ను కలసి ఒత్తిడి తెస్తాం. ఆమోదించకపోతే వారు భయపడుతున్నట్లే కదా? ప్రజలకు అన్నీ తెలుసు. వారే తీర్పిస్తారు.

**– ఇలపావులూరి మురళీమోహనరావు**

సెల్ : 9866194944


For e-magazine
Please Visit us :
www.gundlakamma.com

# కాంగ్రెస్‌లో చెల్లని కాసు చిరంజీవి

ఇలపావులూరి మురళీమోహన్‌రావు
సెల్ : 9866194944

చెట్లకొమ్మలకు తల్లకిందులుగా వేలాడుతుండే తీతువు పిట్టలు ఆకాశ భారాన్నంతా తామే మోస్తున్నామని విర్రవీగు తుంటాయట. 'జగన్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలనుకుంటుంటే మేము నిలబెడు తున్నాం' అని చిరంజీవి మీడియా ముందు చెబుతుంటే ఆ తీతువు పిట్టలే గుర్తుకొస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టకూడదని ఒకవంక తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు శాయశక్తులా ప్రయత్ని స్తుంటే – చిరంజీవి తనకున్న పదిహేడు మంది బలంతో కిరణ్ సర్కారును నిలబెడతాడట. 'చిరంజీవి చాలా గొప్ప నాయకుడు. కాంగ్రెస్‌లో అతిముఖ్యమైన, గౌరవనీయుడైన నాయకుడు. ఆయన చేరిక వలన కాంగ్రెస్‌కు బలం పెరిగింది. తగిన సమయంలో తగిన విధంగా ఆయనకు తగిన పదవితో సత్కరిస్తాం' అని గులాం నబీ ఆజాద్ ఉబుసుపోక కబుర్లు చెబుతుంటే, వాటిని నిజమని నమ్మి – తాను కేంద్ర మంత్రిని కాబోతున్నానని చిరంజీవి గాలిమేడలు కట్టుకుని విహరిస్తుంటే నవ్వాలో ఏడవాలో తెలియడం లేదు. సినిమారంగంలో మెగాస్టార్‌గా నీరాజనాలందుకున్న చిరంజీవి – నేడు పదవీ వ్యామోహంతో రగిలిపోతూ – కాంగ్రెస్ అధిదేవతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంటే చిరంజీవి అభిమానులు సైతం తలలు దించుకుంటున్నారు.



ఇది ఈ వ్యాసకర్త అభిప్రాయం కాదు. ఇటీవల ఒక తెలుగు న్యూస్ ఛానెల్ వారు నిర్వహించిన కార్యక్రమంలో బయటపడ్డ నిజం. రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, తిరుపతి మొదలైన పట్టణాలలో ఒక తెలుగు టి.వి. ఛానెల్‌వారు చిరంజీవి అభిమానులలో ఇంటర్వ్యూలు నిర్వహించి చేసిన ప్రత్యక్ష ప్రసారంలో చిరంజీవి వీరాభిమానులు వెల్లడించిన ఆవేదన ఎలా ఉందో వారి మాటల్లోనే చూద్దాం.

'చిరంజీవిని కాంగ్రెస్ కరివేపాకులా వాడుకుంటున్నదన్న మాట నిజం. కానీ చిరంజీవి చేసిందేమిటి? తిరుపతి నియోజకవర్గ ఓటర్లను చిరంజీవి కరివేపాకులా వాడుకుని వారి మానాన వారిని వదిలేశాడు. కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలను వ్యతిరేకించి మేం చిరంజీవిని గెలిపిస్తే – ఆయన వెళ్ళి కాంగ్రెస్ పార్టీలో దూరిపోయాడు. ఇది ఒక అభిమాని ఆవేదన.

'చిరంజీవికి డెబ్బై లక్షల ఓట్లు లభించాయి. ఈ ఓట్లన్నీ కాంగ్రెస్, తెలుగుదేశం వ్యతిరేక ఓట్లు. తనకు ఓట్లు వేసిన వారి ఆకాంక్షలను మర్చిపోయి – ముష్టి పదవుల కోసం కాంగ్రెస్ పంచన చేరాడు' ఒక అభిమాని ఆక్రోశం.

'చిరంజీవికి పద్దెనిమిది స్థానాల నిచ్చారు ఓటర్లు. ఇంతపెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేలున్నప్పుడు ప్రభుత్వాన్ని ఒక ఆట ఆడించాల్సింది పోయి పదవులకోసం పార్టీని చంపేశాడు' ఒక అభిమాని వేదన

చిరంజీవికి పద్దెనిమిది సీట్లున్నాయి. ప్రజాసమస్యల పట్ల పోరాడకుండా ఢిల్లీ వెళ్ళి అమ్మా.. అమ్మా... అని పదవుల కోసం సోనియాగాంధీని అడుక్కుంటున్నాడు. మరో అభిమాని గుండె మంట.

చిరంజీవికి చిన్నప్పటి నుంచీ అభిమానిని. చిరంజీవి రోడ్ షోలు నిర్వహించినప్పుడు జనాన్ని సమీకరించడానికి నాలాంటి వారెందరో రాత్రింబవళ్ళు కష్టపడ్డాం. తొక్కిసలాటల్లో ఇరవై రెండు మంది అభిమానులు మరణించారు. అయినా చిరంజీవి ఏ ఒక్క కుటుంబాన్ని పరామర్శించలేదు. ఒక్క రూపాయి ఆర్థిక సాయాన్ని అందించలేదు. చిరంజీవి ఏదో ఉద్ధరిస్తాడనుకుంటే ఇవాళ తన పదవి కోసం ఢిల్లీ వెళ్ళి ముష్టి ఎత్తుకుంటున్నాడు. ఒక అభిమాని బాధ.

మనుషుల్ని వాడుకుని వదిలెయ్యడం కాంగ్రెస్ సహజగుణం. చిరంజీవి కాంగ్రెస్‌ను గుడ్డిగా నమ్ముతున్నాడు. చిరంజీవికి కాంగ్రెస్ పార్టీ ఏనాటికీ మంత్రిపదవి ఇవ్వదు. అంతేకాదు 2014 లో చిరంజీవికి టిక్కెట్ కూడా ఇవ్వరు చూస్తుండండి. ఒక అభిమాని కడుపుమంట.

చిరంజీవి చేరికతో కాంగ్రెస్ బలం పెరిగిందా అన్న ప్రశ్నకు ఒక అభిమాని మాట్లాడుతూ 'చిరంజీవికి అంత బలమే ఉంటే అసలు కాంగ్రెస్‌లో ఎందుకు చేరుతాడు? ఇప్పుడు రాజీనామా చేసి మరోసారి తిరుపతిలో పోటీ చెయ్యమనండి. డిపాజిట్ దక్కితే గొప్ప. ఇక ఇతర ప్రాంతాల్లో కాంగ్రెస్ నేం గెలిపిస్తాడు? అని కుండలుబద్దలు కొట్టాడు.

**సాధారణంగా సినిమా హీరోల అభిమానులు తమ హీరోలను ఎవరైనా పల్లెత్తిమాటంటే సహించరు. అందులో చిరంజీవి అభిమానులు మరీనూ.. చిరంజీవి పార్టీ పెట్టిన కొత్తల్లో చిరంజీవికి విమర్శించినందుకు జీవిత, రాజశేఖర్‌ల వెంటబడి తరిమికొట్టారు అభిమానులు. కానీ నేడు ఆ అభిమానులే చిరంజీవికి విమర్శించడం చూస్తుంటే నాటి ప్రజాభిమానాన్ని చిరంజీవి పోగొట్టుకున్నాడనిపిస్తుంది.**

ఇదే సందర్భంలో మరో అభిమాని కోపంగా మాట్లాడుతూ 'చిరంజీవికి డెబ్బై లక్షల ఓట్లు వచ్చాయన్నది నాటి మాట. ఇవాళ వారంతా చిరంజీవి వెంట లేరు. ఇవాళ చిరంజీవికి అంత ప్రజాకర్షక శక్తి లేదు. సొంతపార్టీని నడపలేనివాడు కాంగ్రెస్ పార్టీని ఎలా నడిపించగలడు? వచ్చే ఎన్నికల నాటికి చిరంజీవిని రాజకీయంగా పాతాళానికి తొక్కేయడమే కాంగ్రెస్ లక్ష్యం. కాంగ్రెస్ రాజకీయాలు తెలియక చిరంజీవి వాళ్ళ వలలో చిక్కుకుని పోయాడు అన్నాడు.

పైన చెప్పిన దాన్లో అక్షరం ముక్క కూడా కల్పితం లేదు. ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించిన కార్యక్రమంలోనిది ఈ దంతమంతా.

## వాపు మాత్రమే :

చిరంజీవికి ఓట్లు రాల్చే శక్తి లేదని 2009 లోనే తేలిపోయింది. దాదాపు రెండు వందల పాతిక స్థానాలలో ప్రజారాజ్యం అభ్యర్థులకు డిపాజిట్లు దక్కలేదు. గెల్చిన వారిలో మూడొంతుల మంది అరకొర మెజారిటీతో గెలిచిన వారే. చిరంజీవికి జనాన్నాకర్షించే శక్తి లేదని నాడే తెలిసిపోయింది. అయినా చెక్కభజన చేసి అంతో ఇంతో ముదుపులందుకునే కొందరు మిడియా వ్యక్తులు మాత్రం చిరంజీవి వాస్తవ బలాన్ని తెలియజెయ్యడం లేదు. చిరంజీవికి అంత సీన్‌లేదని ప్రైవేటు సంభాషణలలో అంగీకరించే వారు – పైకి మాత్రం ఆ విషయాన్ని చస్తే చెప్పరు. నలభై రెండు పార్లమెంట్ సీట్లలో ఒక్కదాన్ని కూడా చిరంజీవి గెలిపించుకోలేకపోయాడు. అభిమానులంతా ఓటర్లు కారనే విషయం చిరంజీవికి ఆనాడే తెలిసింది. అధికార వ్యామోహంతో అల్లాడిపోతున్న చిరంజీవి ఆనాటి నుంచే పార్టీని మూసేసి కాంగ్రెస్‌లో చేరిపోవాలని వెంపర్లాడిపోయాడు. సమయం కోసం మాత్రమే వేచి చూస్తున్నాడు. ఈ సమయంలో ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసుకుని చిరంజీవిని పదవితో గౌరవించాలని వై.యస్.రాజశేఖర్ రెడ్డి ఎన్నికలైన మర్నాడే అధిష్టాన వర్గానికి ఒక మెయిల్ పంపించాడని వై.యస్. మరణించిన రెండు సంవత్సరాల తరువాత ఒక పుకారు లేవదీశారు. కంప్యూటర్ మాస్టర్ ఉండవల్లి అరుణ్‌కుమార్ దీన్ని సృష్టించాడు. నిజానికి చిరంజీవి బలమెంతో తెలిసిన వై.యస్. ఎన్నికలయిన మర్నాడే అలా చేస్తాడంటే ఈనాటికీ ఎవరూ నమ్మడం లేదు. జగన్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన తరువాత – ప్రజారాజ్యం విలీనం ప్రక్రియ మొదలైన అనంతరం ఇలాంటి గాలి వార్తలు వచ్చాయి. ప్రత్యర్థి పార్టీలను అంతరింపజేసే విధానంలో భాగంగానే కాంగ్రెస్ పార్టీ ఇలాంటి ఎత్తులు వేస్తుంది. ఇదే ఫార్ములా టీఆర్ఎస్ మీదికి కూడా ప్రయోగించింది. చిరంజీవిని ఏదో విధంగా

అడ్డు తొలగించుకోవాలనే ఉద్దేశ్యంతోనే పదవుల వలప్రయోగిస్తే – చిరంజీవి తెలివి తక్కువ చేప మాదిరిగా ఆ వలలోపడిపోయాడు.

## బ్లాక్ మెయిల్ రాజకీయాలు :

విలీనమైన సంవత్సరం తరువాత కూడా ఎలాంటి పదవులూ రాకపోవడంతో కాంగ్రెస్ పార్టీ సాంబారులో తాను కరివేపాకులా మారానని చిరంజీవికి జ్ఞానోదయమైంది. విలీనం అయిన మరుక్షణం తనకు కేంద్రమంత్రి పదవి లభిస్తుందని చిరంజీవి ఎంతగానో ఆశపడ్డాడు. నెలలు గడుస్తున్నా అలాంటిదేం జరుగలేదు. ఏం చెయ్యడానికి పాలుపోలేదు. మళ్ళీ వెనక్కు వెళ్దామంటే పరువుపోతుంది. ఉందామా అంటే పదవి లేదు. శ్లేష్మంలో ఈగ వలె కొట్టుకుంటున్న తరుణంలో అనుకోకుండా చంద్రబాబు నాయుడు అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించాడు. ఇదే అదనుఅనుకుని రేపు ఓటింగ్ అనగా కాంగ్రెస్ పార్టీ తమను చిన్నచూపు చూస్తున్నదని అసెంబ్లీ లాబీలో అసంతృప్తి వెళ్ళగక్కాడు చిరంజీవి. ఒక్కసారిగా చిరంజీవి అడ్డం తిరగడంతో అధిష్టానం బిత్తరపోయి చిరంజీవిని బుజ్జగించింది. రాష్ట్రంలో మూడు మంత్రి పదవులు, కేంద్రంలో చిరంజీవికి మంత్రి పదవి ఆశచూపించింది. చిరంజీవికి ఏ మాత్రం లోకజ్ఞానం ఉన్నా, అదేదో తక్షణం జరగాలని పట్టుబట్టేవాడు. కానీ పదవీ వ్యామోహంతో విలవిలలాడిపోతున్న చిరంజీవి – కాంగ్రెస్ ను బెదిరించే సాహసం చెయ్యలేక వెంటనే కాంగ్రెస్ మాటలు నమ్మేశాడు. చిరంజీవి మద్దతుతో కాంగ్రెస్ గండం గట్టెక్కింది. ఇక తమకు పదవులు లభించడమే ఆలస్యం అనుకుంటున్న తరుణంలో – కాంగ్రెస్‌లోబ్లాక్ మెయిల్ రాజకీయాలు నడవవని – అధిష్టానం దృష్టిలో చిరంజీవి బ్లాక్ మెయిలర్‌గా ముద్ర పడ్డాడని ఒక నాయకుడు బాంబు పేల్చాడు. అది నిజమేనని అజిత్ సింగ్‌కు మంత్రి పదవినిచ్చి చిరంజీవిని పక్కన పెట్టడం ద్వారా అధిష్టానం ఋజువు చేసింది. రాష్ట్రంలో ప్రజారాజ్యం ఎమ్మెల్యేలకు తరువాత మంత్రి పదవులిస్తామని, ఇప్పుడు మంత్రి వర్గ విస్తరణ లేదని, ఉప ఎన్నికల తరువాత చూసుకుందామని కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడటం, అదే సమయంలో సి.రామచంద్రయ్యకు పదవిస్తే సహించమని కాంగ్రెస్ నాయకుడు వీరశివారెడ్డి ప్రకటించడం, ప్రజారాజ్యం అధికారికంగా ఇంకా విలీనం కాలేదని మరో మంత్రి గారు మీడియా ముందు చెప్పడం ఇవన్నీ ప్రజారాజ్యం భవిష్యత్తుకు సూచికలు.

## స్వయంకృతాపరాధాలు :

అసలు చిరంజీవి చేరిక పట్ల కాంగ్రెస్‌కు ఒనగూరిన అదనపు బలం ఏమిటని ఆలోచిస్తే శూన్యమే సమాధానం. సాధారణంగా ఎవరైనా నాయకులు పార్టీలు మారినప్పుడు వారితోపాటు కొన్ని వందలు, వేలమంది కార్యకర్తలు అదే పార్టీలో చేరుతుంటారు. ఎవరైనా నాయకులు కాంగ్రెస్ నుంచి తెలుగుదేశం, తెలుగుదేశం నుండి టీఆర్ఎస్.. ఇలా పార్టీలు మారినప్పుడు ఆ నాయకుడి అనుచరులు వేలసంఖ్యలో పార్టీ మారుతారు. కానీ చిరంజీవి, ఆయన ఎమ్మెల్యేలు మరో పదహారు మంది ప్రజారాజ్యం నుంచి కాంగ్రెస్‌లో చేరినప్పుడు వారిని అనుసరించిన కార్యకర్తలు ఎంతమంది? ఒక్కరంటే ఒక్కరైనా ప్రజారాజ్యం పార్టీ కార్యకర్త తమ నాయకులను అనుసరించి కాంగ్రెస్ పార్టీలో చేరాడా? అంటే.. ప్రజారాజ్యం విలీనం వలన కాంగ్రెస్ కార్యకర్తల సంఖ్య పెరిగింది కేవలం పదిహేడు మాత్రమే.

మాకు డెబ్బైలక్షల ఓట్లు ఉన్నాయని ప్రకటించిన చిరంజీవి నేడు కనీసం డెబ్బైమందిని కూడా తనతోపాటు కాంగ్రెస్‌లో చేర్పించలేకపోయాడే ఏరీ ఆ డెబ్బై లక్షల మంది? ఎటుపోయారు? దీన్ని బట్టి చూస్తే ప్రజారాజ్యంలో నాయకులు పదిహేడు మంది తప్ప కార్యకర్త ఒక్కడు కూడా లేడని తేలిపోలేదా? కాంగ్రెస్‌కు ఈ విషయం తెలియకుండా ఉంటుందా? దీనికి బాధ్యుడు చిరంజీవి కాదా? ఒక్క కార్యకర్త బలం కూడా లేని చిరంజీవికి మంత్రిపదవి ఎలా వస్తుంది.




ఏళ్ళ తరబడి కాంగ్రెస్‌లో సేవలందిస్తున్న నాయకులు – నిన్నగాక మొన్న పార్టీలో చేరిన ప్రరాపా ఎమ్మెల్యేలకు మంత్రిపదవులిస్తే సహించగలరా?

విలీన ప్రతిపాదన వచ్చిన రోజున చిరంజీవికి ఢిల్లీలో ఘనస్వాగతం లభించింది. జీవిత పర్యంతం పనిచేసిన నాయకులకు కూడా లభించని సోనియా దర్శనం చిరంజీవికి వెంటనే దొరికింది. కానీ ఆ తరువాతేం జరిగింది? ఇవాళ చిరంజీవి ఢిల్లీ వెళ్తే పలకరించే నాధుడు లేడు సోనియా దర్శనం కలలోని మాట. చిరంజీవికి ఎంపీలు లేరు కదా అని అహ్మద్ పటేల్ లాంటి నాయకుల సన్నాయినొక్కులు. ఉప ఎన్నికల తరువాత చూద్దామని మరొకరు. చిరంజీవి మంత్రి

పదవిస్తే తిరుపతి సీటు ఖాళీ అవుతుంది. ఆ సీటు కాంగ్రెస్ మళ్ళీ గెల్చుకోవడం కష్టం అంటున్న నాయకులు మరికొందరు. ఇవన్నీ దేనికి సంకేతాలు? తిరుపతి సీటును తాను మళ్ళీ గెలిపిస్తానని చిరంజీవి కూడా గట్టిగా చెప్పలేకపోతున్నాడు. కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన జగన్ పదవికి కూడా రాజీనామా చేసి మళ్ళీ గెల్చాడు. జగన్ వర్గం వారు రాజీనామాలు చేసి దమ్ముంటే ఉప ఎన్నికలు పెట్టించమని వారంతా సవాల్ విసురుతున్నారు. చిరంజీవి కానీ, ఆయన వెంట ఉన్న పదహారు మంది ఎమ్మెల్యేలు కానీ ఒక్కరైనా తమ పదవికి రాజీనామా చేసి చిరంజీవి పేరుమీద మళ్ళీ గెలుస్తామని మాటవరుసకైనా అనే సాహసం చెయ్యగలిగారా?

తమకు మూడు ప్రాంతాల నుంచి మూడు మంత్రి పదవులు కావాలని చిరంజీవి స్వయంగా కోరాడు. అయినా కాంగ్రెస్ పార్టీ నుంచి కనీస స్పందన లేదు. చిరంజీవి ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇవ్వనందువలన పార్టీకి గానీ, ప్రభుత్వానికి గానీ వచ్చే నష్టం ఏమీలేదని అహ్మద్‌పటేల్ వ్యాఖ్యానించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ అభిప్రాయం స్పష్టంగా తెలిసిపోయింది.

## గుడ్డికన్ను మూసినా, తెరిచినా...

నిజం ఎప్పుడూ చేదుగానే ఉంటుంది. ప్రస్తుతం కాంగ్రెస్‌లో చిరంజీవి పరిస్థితి గుడ్డికన్ను చందాన ఉంది. చిరంజీవి, ఆయన వెంట వచ్చిన ఎమ్మెల్యేలు ఎక్కడకూ పోరని, ఒకవేళ చిరంజీవి అలిగి ఆగ్రహంతో వెళ్ళిపోయినా ఎమ్మెల్యేలు ఎవరూ ఆయనతో వెళ్ళరని, చచ్చినట్లు చిరంజీవి కాంగ్రెస్‌లో పడిఉండక తప్పదని అధిష్ఠానం ఒక నిర్ణయానికి వచ్చేసింది. అధిష్ఠానం స్వయంగా చిరంజీవి చరిష్మామీద ఎంక్వైరీ చేయించి, చిరంజీవికి ఇది వరకున్నంత ఆకర్షణ శక్తి లేదని తెలుసుకుందని, అందువల్ల చిరంజీవికి అంతగా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదని నిశ్చయించుకుందని భోగట్టా. కాకపోతే ఇప్పుడు చిరంజీవికి పదహారు మంది ఎమ్మెల్యేలున్నారు కాబట్టి నోరు విప్పడం లేదు. రేపెప్పుడైనా జగన్‌తో సఖ్యతకుదిరితే – చిరంజీవికి వెంట్రుక ముక్కను తీసిపారేసినట్లు తీసి అవతల పారేస్తుంది కాంగ్రెస్ పార్టీ.

పాపం తెలివితక్కువగా వ్యవహరించి పదవుల పట్ల దురాశతో కాంగ్రెస్ పాచికలకు బలై పరువును పూర్తిగా పోగొట్టుకున్నాడు చిరంజీవి.

అందరూ ఎన్టీయార్లు కాలేరండీ.


**గుండ్లకమ్మ మాస పత్రికకు చందా దారులుగా చేరాలనుకుంటున్నారా!**

రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక సర్క్యులేషన్ కలిగి మల్టీ కలర్‌తో గ్రామీణ ప్రాంతమునుండి వెలువడుతూ, పాఠకుల విశేష ఆదరాభిమానాలు పొందుతున్న "గుండ్లకమ్మ" మాస పత్రికకు చందాదారులుగా చేరండి

ప్రతి నెల మీ ఇంటికి పోస్టు ద్వారా తెప్పించుకోండి.

**రెండు సంవత్సరముల చందా రూ.200/- లను**

**"అఖిల్ పబ్లికేషన్స్" పేరుతో డి.డి. లేదా యం.ఓ.ను**

మీ పూర్తి అడ్రస్సుతో ఈ క్రింది చిరునామాకు పంపగలరు...

**అఖిల్ పబ్లికేషన్స్, కాకాని పాలెం, అద్దంకి. ప్రకాశం జిల్లా. ఫోన్: 98485 59566**

ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా తెలుగు పాఠకుల కోసం ఇంటర్‌నెట్‌లో

**"గుండ్లకమ్మ"**

**www.gundlakamma.com**

# పర్యావరణ మిత్రకార్యక్రమము అమలు



**సందిరెడ్డి శ్యామలాదేవి**
ప్రధానోపాధ్యాయురాలు

యం.పి.పి.యస్ (ఎ.ఎ) జార్లపాలెం అద్దంకి (మం) ప్రకాశం జిల్లా లో పర్యావరణ మిత్ర కార్యక్రమంలో భాగస్వాములైనది. ఈ కార్యక్రమములో మనం ప్రతిరోజు చేసే పనులలో ముడిపడి వున్న వ్యర్థాల నిర్వహణ, నీటి సంరక్షణ శక్తి సంరక్షణ, జీవ వైవిద్యం, సంస్కృతి అనే అంశాలు చేపట్టబడినవి.

వ్యర్థాల నిర్వహణలో వ్యర్థాలు ఎక్కడ నుండి వస్తున్నాయి. పాఠశాలలో ఎంత మొత్తంలో వ్యర్థాలు తయారు అవుతున్నాయో వ్యర్థాల రకములు, తొలగింపు, ఎరువుగా మార్చి చెట్లుకు ఎరువుగా ఉపయోగించడం జరుగుతుంది.

నీటి సంరక్షణ భాగంగా నీటిని వృధాగా వాడకుండా, పొదుపుగా వాడటం, వృధాగా పోయే నీటిని నిలుపుదల చేయడం ఇంకుడు గుంట ఏర్పాటు చేసి నీటిని బడిలో ఇంకింపచేయడం జరుగుతుంది. వృధాగా పోయే నీటిని చెట్లకు ఉపయోగించడం.

శక్తి సంరక్షణ కొరకు గుబ్బ బల్బ్‌లు బదులు కాంపాక్ట్ ఫ్లోర్ సెంట్ లైట్లు వాడకము దీని వలన విద్యుత్ పొదుపు అవుతుంది.

పాఠశాలలో నలభై చెట్లకు పైగా నాటి సంరక్షణ చేసి ఒక పార్కులాగా ఆనందాయకమైన కాలుష్య రహితమైన వాతావరణాన్ని కల్పించారు. వీటిలో ఔషద మొక్కలు, నీడను ఇచ్చే మొక్కలు, కూరగాయల మొక్కలు, పూల మొక్కలు నాటడం జరిగింది. వీటి సంరక్షణకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. సంస్కృతిలో భాగంగా గ్రామస్థులకు, ప్లాస్టిక్ వాడకం నిషేధం, కృతిమరంగుల నిషేధం, సహజరంగులవాడకం, బహిరంగంగా మూత్ర విసర్జన నిషేదం. సమావేశాలు నిర్వహించడం జరుగుతుంది. మూఢనమ్మకాలు తొలగించడునని సైన్సు ప్రయోగాలు చేసి శ్రమపై అవగాహన పరచడం.

ఈ విధంగా కార్యక్రమం అమలు చేస్తున్నందుకు, గ్రామస్థులు, తల్లిదండ్రులు, అధికారులు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యస్. శ్యామలాదేవిని అభినందించారు.









# ఉద్యాన శాఖ - ప్రకాశం జిల్లా

ప్రకాశం జిల్లాలో ఉద్యాన పంటల అభివృద్ధికి జాతీయ ఉద్యాన మిషన్ మరియు రాష్ట్రీయ కృషి వికాస యోజన పథకముల ద్వారా అమలు చేయుచున్న పథకములు.



**శ్రీ కాంతిలాల్ దండే**
కలెక్టర్, ప్రకాశం జిల్లా.

## జాతీయ ఉద్యాన మిషన్

★ మామిడి, బత్తాయి, నిమ్మ, జామ తోటల విస్తరణకు 75% రాయితీ మరియు బొప్పాయి - టిష్యూ కల్చర్. అరటితోటల అభివృద్ధికి 50% రాయితీ.

★ బత్తాయి మరియు నిమ్మతోటల పునరుద్ధరణకు 50% రాయితీ.

★ మామిడి, బత్తాయి, నిమ్మతోటల కొమ్మ కత్తిరింపులకు 50% రాయితీ.

★ వానపాముల ఎరువు తయారీ యూనిట్లకు మరియు హెచ్.డి.పి.ఇ., వర్మీబెడ్స్‌కు 50% రాయితీ.

★ సమగ్ర సస్యరక్షణ మరియు సమగ్ర పోషక యాజమాన్యం పథకం క్రింద పండ్లు మరియు కూరగాయల తోటలకు 50% రాయితీ

★ వేసవిలో పండ్లతోటలను రక్షించుకునేందుకు నీటి నిల్వ కుంటలు (ఫామ్ పాండ్స్) నిర్మించుకునేందుకు ఇతరులకు 90% రాయితీ మరియు ఎస్సీ, ఎస్టీ లబ్దిదారులకు 100% రాయితీ.

★ తైవాన్ స్ప్రేయర్స్, ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్స్ మరియు హెచ్.డి.పి.ఇ. పాలీషీట్స్ (మిరపకాయలను ఆరబెట్టుకొను పట్టలు) 50% రాయితీ.

★ మౌళిక సదుపాయాల కల్పనకోసం శీతల గిడ్డంగులు, రైపెనింగ్ ఛాంబర్లు, గ్రామీణమార్కెట్ల నిర్మాణానికి 40% రాయితీ.

★ రైతులకు క్షేత్ర స్థాయిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పై శిక్షణాకార్యక్రమం నిర్వహించుట.

## రాష్ట్రీయ కృషి వికాస్ యోజన

★ 50% రాయితీపై అన్ని రకాల హైబ్రిడ్ కూరగాయల విత్తనములు సరఫరా.

★ 50% రాయితీ పై షెడ్ నెట్ల నిర్మాణము.

★ 90% రాయితీపై హైబ్రిడ్ కూరగాయల మినీ కిట్ల పంపిణీ.

★ 50% రాయితీతో కూరగాయల రవాణా కొరకు ప్లాస్టిక్ క్రేట్ల సరఫరా.

**బి. రవీంద్రబాబు,**
అసిస్టెంట్ డైరెక్టర్ - 1, ఉద్యానశాఖ, ఒంగోలు.


**శ్రీమతి పి.జెన్నెమ్మ,**
అసిస్టెంట్ డైరెక్టర్ - 2, ఉద్యానశాఖ, ఒంగోలు.

# నడవటానికి ఇష్టపడండి

**"శరీరంలోని మొత్తం ఎముకల్లో నాలుగో వంతు మన పాదాల్లోనే ఉన్నాయి"**

మానవ దేహాన్ని, మేధస్సును అభివృద్ధి చేయటానికి లెక్కకు మించిన సమకాలీన ఆలోచనా విధానాలు, సిద్ధాంతాలు అంకితభావంతో పనిచేస్తున్నాయి. వివిధ రకాల వ్యాయామాలు చేయమని అవి మనకి ఉద్బోధిస్తున్నాయి. కాని అతి ప్రాచీనమైన. తేలికైన, సహజమైన ఆరోగ్య మార్గాన్ని మనం విస్మరించాం. ఇది ఎక్కడో లేదు – మన పాదాల వద్దనే ఉంది. నడవటమే ఆ ఆనంద మార్గం. ప్రాణ వాయువును ఎక్కువగా పీల్చటానికి అవసరమైన శక్తి నిచ్చేది కాలి నడక ఒక్కటే. కాబట్టే అరవై నాలుగు కళల్లో ఒకటిగా 'భ్రమణకళ'ని కూడా గుర్తించారు భారతీయులు. సృజనాత్మకత – నడక ద్వారా వివిధ ప్రాంతాల లో పర్యటించడం చాలా మంచిది. ప్రశ్నించే మెదడుకు సంతృప్తికరమైన జవాబునిచ్చేది నడక ఒక్కటే. మనలో దాగి ఉన్న అనేక రహస్యమైన, శక్తివంతమైన జ్ఞాన కవాటాలు తెరుచుకొనేది ప్రకృతిలో పర్యటిస్తూ ఉన్నప్పుడే. మన హృదయాల మౌనభాషలు కూడా ఆ సమయాల్లో మనకు అర్ధమౌతాయి. నీరసించిన ప్రాణానికి ఆహ్లాదాన్నిచ్చేవి, నిరాశతో ఉన్నవారికి ఆత్మవిశ్వాసాన్నిచ్చేవి ప్రకృతిలో ప్రయాణాలు. జ్ఞాన తృష్ణలో, అన్వేషణలో, పరిశోధనల్లో మనం కోరిన ప్రాంతానికి మనల్ని మోసుకుపోతున్నాయి ఈ చిన్ని పాదాలు. తత్త్వవేత్తలు, కవులు, చిత్రకారులు మరియు స్వాప్నికులు తమ మనోభావాలని వ్యక్తీకరించటానికి ఈనాటికీ పాద ప్రయాణాలే చేస్తున్నారు. యాంత్రిక యుగం : ఆధునిక యుగంలో చక్రాలు, యంత్రాలు రంగ ప్రవేశం చేసి మన పాదాల స్వాతంత్ర్యాన్ని పూర్తిగా హరించి వేసాయి. నడవటం మరచిపోయాం. శరీరాలకి వ్యాయామం తగ్గి, సరిగ్గా పనిచేయలేని స్థితిలోకి చేరుకున్నాం. నగరాల్లోనూ, ఆకాశహర్మ్యాల లోనూ ఉండేవారి నడక కేవలం టెలివిజన్ మంచాలు – కారు మధ్య గల కొద్ది దూరాన్ని మాత్రమే నడవటానికి పరిమితమైంది.

పాదాలే పునాది – ఊపిరి పీల్చుకోవడం ఎంత సహజంగా జరిగిపోతూ ఉందో అంతే సహజంగా మనమూ నడవాలి. మానవ



అస్థిపంజరం 206 ఎముకల నిర్మాణం. అందులో నాలుగోవంతు ఎముకలు, అంటే 52 కేవలం మన రెండు పాదాల్లోనే ఇమిడి ఉన్నాయంటే ఆశ్చర్యపోక తప్పదు. మానవ దేహ నిర్మాణానికి పునాది అంత కట్టుదిట్టంగా ఏర్పడింది. పాదాలకి వ్యాయామం కల్పించలేక పోతే ఆ పునాది కదలిపోయే ప్రమాదం ఉంది. మనం నడుస్తున్న ప్రతిసారీ, శరీరంలోని 650 కండరాలు సంతోషంతో స్పందిస్తాయి.

అది ఒక జీవన విధానం : ప్రాచీన కాలం నుండి భారతీయ ఋషులు, యోగులు పాదయాత్రల ప్రయోజనాల గురించి ప్రచారం చేస్తూనే ఉన్నారు. మనో – శారీరక విధుల నిర్వహణలో పాదయాత్రల పాత్రని ఉన్నతంగా చిత్రీకరించారు. ఆ రోజుల్లో 'జనపద పరీక్ష' పేరుతో పర్యటనలు విస్తృతంగా జరిపేవారు. బౌద్ధుల 'ప్రాతిమోక్ష సూత్రాలు' ఇందుకు నిదర్శనం. ఈనాటికీ గ్రామీణులు సంవత్సరానికి ఒక్కసారైనా సుదీర్ఘ తీర్థయాత్రల్ని చేస్తూ ఉంటారు. నగరాల్లోని ప్రజలు వ్యాయామం కోసం నడిచే కొద్ది దూరాలు వారిని చల్లని గ్రామీణ వాతావరణంలోనికి తీసుకువెళ్ళి ఆహ్లాదాన్ని కలుగజేస్తున్నాయి. సమకాలీన జీవితాన్ని, సంస్కృతిని అధ్యయనం చేయటానికి పాదయాత్రలే ఉత్తమ వాహనం. కాబట్టే యాత్రికులు నడవటానికి ఇష్టపడుతూ ఉంటారు. క్రీడల్లో భాగంగా – 19వ శతాబ్దపు చివరి భాగంలో వాకింగ్‌ను ఒక క్రీడగా విదేశీయులు గుర్తించి పోషించడం మొదలు పెట్టారు. వందల కిలోమీటర్లు దూరాన్ని తక్కువ కాలంలో నడచిన వ్యక్తిగత రికార్డులు అంతకుముందే ఉన్నా, 1908 లోనే ఈ వాకింగ్‌ని ఒలెంపిక్ క్రీడల్లో ప్రవేశపెట్టారు. అప్పటినుండి ఈ వ్యాపకం ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ప్రజాదరణకి, అభిమానానికి నోచుకుంది. నాట్యం లాగానే, నడక కూడా ఒక కళగా గుర్తింపు పొందింది. ఇదో ఔషదం : ఈ రోజుల్లో నడక తనకు తానుగా ఒక ఔషదంగా రూపు దిద్దుకొంటూ వుంది. శరీరంలోని అనేక రుగ్మతలని దూరం చేసే దివ్యౌషధంగా దీన్ని వైద్యులు గుర్తించారు. యుగ యుగాలుగా మానవాళి నడవడికను నిర్ధేశించిన ఒకే ఒక్క ఔషదం ఈ నడక. దేశాటనం చేయాలనుకొనేవారు తమ పాదాల పునాదుల్ని ధృడంగా ఉంచుకోవడం ఎంతో అవసరం. ఇప్పటికి మించిపోయింది ఏమీ లేదు. మన శారీరక, మానసిక ఆరోగ్యాల కోసమే కాకుండా, భావి తరాల మానవాళి శ్రేయస్సు కోసం నడుద్దాం రండి!

**- భ్రమణ కాంక్ష ఆదినారాయణ,**
ఆంధ్రా యూనివర్సిటి, విశాఖపట్టణం.

❄ ❄ ❄ ❄ ❄

# అందరూ చదవాలి - అందరూ ఎదగాలి
# అనే లక్ష్యసిద్ధి కోసం 2011-12
# రాజీవ్ విద్యా మిషన్ సాగించిన కృషి


**జె. ఎలీషా,**
ప్రాజెక్టు అధికారి
రాజీవ్ విద్యామిషన్
ఒంగోలు.







**శ్రీ కాంతిలాల్ దండే**
కలెక్టర్, ప్రకాశం జిల్లా.

## సర్వశిక్ష అభియాన్ విద్యాభివృద్ధి కొరకు చేపడుతున్న కార్యక్రమాలు

6 నుండి 14 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికి ఉచిత నిర్భంధ విద్యను అందించడానికి విద్యాహక్కు చట్టం
ఏప్రియల్, 2010 నుండి భారతదేశమంతటా అమలులోకి వచ్చింది. ఈ చట్ట ప్రకారము మన ప్రకాశం జిల్లాలో 2011-12 విద్యా సంవత్సరానికి గాను సర్వశిక్ష అభియాన్ చేపట్టిన కార్యక్రమాలు
**మౌళిక వసతుల కల్పన :** 1013 అదనపు తరగతుల నిర్మాణము బాల బాలికలకు 417 మరుగు దొడ్ల నిర్మాణము, పట్టణ పరిధిలో 19 పాఠశాలలకు మంచి నీటి వసతి, 50 పాఠశాలలకు ప్రహరి గోడ నిర్మాణము, 260 పాఠశాలలకు ర్యాంపుల నిర్మాణము, కె.జి.బి.వి.లకు భవన నిర్మాణములు చేపట్టడం జరిగింది.
**గ్రాంటులు :** 3382 ప్రాథమిక పాఠశాలలకు ఒక్కొక్క పాఠశాలకు రు.5,000/-ల చొప్పున పాఠశాల గ్రాంటు రు.5,000/-లు పాఠశాల నిర్వహణ గ్రాంటు, 849 ప్రాథమికోన్నత పాఠశాలలకు ఒక్కొక్క పాఠశాలకు రు.5,000/-లు చొప్పున పాఠశాల గ్రాంటు రు.7,000/-ల చొప్పున పాఠశాల నిర్వహణ గ్రాంటు, 12274 ఉపాధ్యాయులకు ఒక్కక్క ఉపాధ్యాయునికి రు.500/-లు చొప్పున టీచరు గ్రాంటు, 56 మండల కేంద్రాలలో మండలరిసోర్స్ సెంటర్‌కు యమ్.ఆర్.సి. గ్రాంటుగా ఒక్కొక్క సెంటరుకు రు.1,00,000/-లు చొప్పున 297 స్కూల్ కాంప్లెక్సు కేంద్రాలకు ఒక్కొక్క కేంద్రానికి రు.27000/-లు చొప్పున సి.ఆర్.సి. గ్రాంటు విడుదల చేయడం జరిగింది.

- ★ అంగన్‌వాడి కేంద్రాలు లేని అవాస ప్రాంతాలలో గల పిల్లల కొరకు 52 చిన్నారి వికాస కేంద్రాలు ఏర్పాటు.
- ★ జిల్లాలో 63 ఇ.జి.యస్. సెంటర్లలో 1612 మంది పిల్లల విద్యను అభ్యసిస్తున్నారు.
- ★ ఇతర ప్రాంతాల నుండి వలస వచ్చిన తలిదండ్రుల పిల్లల కొరకు వర్క్ సైట్ పాఠశాలలు ఏర్పాటు చేయుట జరిగినది.
- ★ మధ్యలో బడి మానేసిన ఆడ పిల్లల కొరకు 37 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలలో 4475 మంది బాలికలకు ఉచిత విద్యతో పాటుగా భోజనవసతి మరియు నివాసము కల్పించడమైనది.
- ★ బడి మానేసిన బాల బాలికల కొరకు 21 రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్స్ 808 మంది విద్యార్థులకు ఉచిత విద్యతో పాటుగా భోజన వసతి మరియు నివాసము కల్పించడమైనది.
- ★ ముస్లిమ్ పిల్లలకు సంప్రదాయ విద్య అందించుటకు 71 మదరసాలు స్థాపించబడినవి. 2717 మంది ముస్లిమ్ విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.
- ★ పనుల కాలంలో దూర ప్రాంతాలకు వలస వెళ్లే తల్లిదండ్రుల పిల్లల కొరకు 3 సీజనల్ హాస్టల్స్ లో 182 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.
- ★ ప్రత్యేక అవసరాలు గల పిల్లల కొరకు (చెవుడు, మూగ, గుడ్డి, కుంటి, మానసిక వికలాంగులు) 68 మంది ఐ.ఇ.డి.టీచర్లు 56 మండలాలలో నియమింపబడినారు. 388 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఇంటి వద్దనే విద్యను అందిస్తున్నారు. 126 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు మైనర్ సర్జరీ చేయడం జరిగింది. 610 (సిడబ్ల్యుయస్‌యన్) పిల్లలను రెగ్యూలర్ పాఠశాలలో చేర్పించడం జరిగింది. 19 మంది ఫిజియోథెరపిస్టులు 56 మండలాలలో ప్రతి నెల ఫిజియోథెరపి క్యాంపులు నిర్వహిస్తున్నారు.
- ★ విద్యాపరంగా వెనుకబడిన 37 బ్లాక్ లలో 272 యన్.పి.ఇ.జి.ఇ.యల్ పాఠశాలలో 12109 బాలికలకు వివిధ వృత్తులలో శిక్షణ ఇవ్వడం జరుగుచున్నది.
- ★ విద్యార్థులలో గుణాత్మక విద్యను సాధించుటకు యల్.ఇ.పి. ప్రొగ్రామ్ లో భాగంగా 56 మండలాలలో ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలకు స్నేహ బాల సిమ్ కార్డులను పంపిణీ చేయడం జరిగింది.
- ★ విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించుటకు 61 సి.ఎ.ఐ. పాఠశాలలకు కంప్యూటర్లును అందజేయడం జరిగింది. ఇప్పటివరకు 595 మంది ఉపాధ్యాయులు కంప్యూటర్ శజక్షణ తీసుకున్నారు.
- ★ ప్రత్యేక అవసరాలు గల పిల్లకు అన్ని మండల కేంద్రాలలో ఫిజియోథెరపి క్యాంపులు నిర్వహించడం జరుగుచున్నది.
- ★ యస్.ఐ., యస్.టి., విద్యార్థుల కొరకు ఆట వస్తువులు, డిక్షనరీస్, పెద్దబాలశిక్ష మొదలైన గ్రంధాలు అందించడం జరిగింది.
- ★ ప్రతి పాఠశాలకు విద్యుత్ సౌకర్యం కల్పించబడినవి.
- ★ ఏజెన్సీ ప్రాంతాలలో, కొండ ప్రాంతాలలో పిల్లల కొరకు కొత్త పాఠశాలలు, రవాణా సౌకర్యం లేని చోట రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేయట జరిగినది.
- ★ వీధి బాలలు, బాల కార్మికుల కొరకు, అనాధల కొరకు ట్రిన్సిట్ హోమ్ నిర్వహిస్తున్నారు.
- ★ హెచ్.ఐ.వి. సంబంధిత పిల్లల కొరకు టంగుటూరులో సాడ్స్ సంస్థ కొలాబిరేషన్ పాఠశాలను నడుపుచున్నారు.
- ★ పాఠశాలలో చదువుతున్న అందరి పిల్లలకు, 260356 జతల యూనిఫామ్స్ పంపిణీ చేయటం జరిగింది.
- ★ ప్రతి నెలా 297 స్కూల్ కాంప్లెక్సు కేంద్రంలో, ఉపాధ్యాయులు శిక్షణ తీసుకుంటున్నారు.

# విశ్వవినువీధుల్లో ఆంధ్రుల ఆడపడుచు

**- డా॥ దగ్గుబాటి పురంధ్రీశ్వరి**




**కేంద్ర మానవ వనరుల శాఖాసహాయమంత్రిగా 6 వసంతాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భముగా ప్రత్యేక వ్యాసం.....**

యన్.టి.ఆర్. వంటి కారణజన్ముడి కడుపున పుట్టి మద్రాసులో పెరిగి ఒక డాక్టరుకు ఇల్లాలై రాజకీయాలకు సుదూరంగా గృహస్తు జీవితం గడుపుతున్న పురంధ్రీశ్వరి ఏకంగా పార్లమెంటుకు ఎన్నికై రాజకీయ ఉద్దండుల నడమ రత్నంలా మెరిసిపోతున్నది. యన్.టి.ఆర్. రాజసం, తేజస్సు, ఓజస్సు, గాంభీర్యం, హావభావాలు, వాచికం, గమనం పుణికి పుచ్చుకున్న పురంధ్రీశ్వరి మొదటి టర్మ్‌లోనే కేంద్ర మానవ వనరుల శాఖాసహాయమంత్రిగా బాధ్యతలు చేపట్టి తన వాక్ చాతుర్యం, మేధాశక్తి, పరిపాలనా సామర్థ్యంతో సోనియాగాంధీ, మన్మోహన్ సింగ్ వంటి దిగ్గజాలనే కాకుండా అగ్రదేశాల అధ్యక్షులు, ప్రధానమంత్రుల ప్రసంశలు కూడా అందుకున్న ఒక తెలుగు బిడ్డ అంతర్జాతీయ వేదికలమీద ఇలా అభినందనలు అందుకోవడం తెలుగుజాతికే గర్వకారణం.

కేంద్రమానవ వనరులశాఖ సహాయమంత్రిగా 6 సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకొని దేశంలో ప్రతిష్ఠాకరమైన 2 మహిళా యూనివర్శిటీల నుండి గౌరవ డాక్టరేట్లను పొందిన డా॥ పురంధ్రీశ్వరి అంతర్జాతీయ వేదికల మీద ప్రదర్శిస్తున్న వాగ్ధాటిని ఎలా సొంతం చేసుకుంది. దీని వెనుక ఆమె ఎలాంటి కృషి చేసింది. అందుకు ప్రేరేపించిన ప్రపంచ ప్రఖ్యాత రాజనీతిజ్ఞులు ఎవరు అన్న అంశాలపై ప్రత్యేక వ్యాసం.



ఆంధ్రుల ఆడపడుచు అంతర్జాతీయ వేదికలెక్కి ఆయా సమస్యల పై చేసిన ప్రసంగాలు అంబరాన్ని అందుకొని అందరిని అబ్బురపరచిన సంఘటనలు మనం మరుపరాని, మరువగూడని మధురస్మృతులు.

పురందేశ్వరి ప్రసంగాలను విశ్లేషణ చేసే ముందు వుపన్యాసాలకు ప్రసంగాలకు రక్త సంబంధం గాఢంగా పెనవేసుకొనే వుందనే నిత్య సత్యాన్ని పసిగట్టింది పురందేశ్వరి.


పురందేశ్వరి పార్లమెంటులో ఆరంగేట్రం చేసే ముందుగా ప్రపంచ చరిత్రను ముందుగా పఠనం చేయడం ప్రారంభించింది. నిర్దిష్ట లక్ష్యాన్ని చేరాలంటే, కొన్ని విశిష్ట లక్షణాలు అలవరచుకొని, సకాలంలో మనం పయనించాలనే ఆమె ప్రతిన ముఖ్యంగా తపన తత్ఫలితంగా –

క్రీ.పూ. 4వ శతాబ్దంలో జీవించిన గ్రీకు రాజకీయవేత్త గ్రేటెస్ట్ ఆరేటర్ ఆఫ్ టైమ్‌గా చరిత్రకారులు పరిగణించే డెమొస్తనీస్‌ను మెసిడోనియా రాజు ఫిలిప్‌కు అతని కుమారుడు చక్రవర్తి అలెగ్జాండర్‌కు వ్యతిరేకంగా ఏథెన్స్ ప్రజలను సమీకరించడానికి అతడు తన వుపన్యాస పాటవాన్ని వినియోగించాడు. మొదట్లో అతనికి నత్తి వుండేదట. అది పోగొట్టుకోవడానికి నోటిలో గులకరాళ్ళు పెట్టుకొని హోరెత్తె సముద్రాన్ని మించి నోరెత్తి వుపన్యసించడం ప్రారంభించాడు. రొప్పుతూ, రోజుతూ, పరుగెడుతూ పద్యాలు గూడా పఠించాడనే చారిత్రక సత్యాన్ని పసిగట్టింది పురందేశ్వరి.

డెమొస్తనీస్ తో పోల్చదగ్గ మరొక మహావక్త క్రీ.పూ. 1వ శతాబ్దం నాటి రోమన్ రాజకీయవేత్త సిసిరో. ఆయనను గ్రేటెస్ట్ ఆఫ్ ది రోమన్ ఆరేటర్స్ అంటారు. అలాగే శ్రోతల్ని మంత్రముగ్ధుల్ని చేసే పేరొందిన మరో వక్త సీజర్ మిత్రుడు మార్కస్ యాంటోనీ. ఇటీవల కాలానికొస్తే ఎడ్మండ్‌బర్క్‌ను గొప్ప వక్తగా పేర్కొంటారు. ఇంకా తర్వాత కాలంలో చర్చిల్ ఇదంతా పాశ్చాత్య దేశాలకథలు, గాథలు.

తదుపరి మన దేశ పూర్వపరాలను గురించి ఆలోచనలకు పదునుపెట్టింది సుమా మన ఆడపడుచు భారత స్వాతంత్ర్యోదమంలో తన అనర్గళ వాగ్ధాటితో ప్రజలను వుర్రూతలూపిన మన ఉపన్యాసములు :


1. **సురేంద్రనాథ్ బెనర్జీ**
2. **బిపిన్ చంద్రపాల్**
3. **రైటారనబుక్ వి.యస్. శ్రీనివాస శాస్త్రి**
4. **అనీబ్‌సెంట్**
5. **సిల్వర్ టంగ్ట్ ఆరేటర్ – సర్వేపల్లి రాధాకృష్ణన్**




**మాసిడోనియా రాజు ఫిలిఫ్**



**ఇటలీ తత్వవేత్త మాజిని**




**కారల్ మార్క్స్**




సురేంద్రనాథ్ బెనర్జి



బిపిన్ చంద్రపాల్




వికె. కృష్ణమీనన్



అనీబిసెంట్

**6. పి.వి. నరసింహారావు**
**7. యం.సి.సెతల్వాడ్**
**8. జఫల్లాఖాన్**
**9. వి.కె. కృష్ణమీనన్**
**10. లాలాలజపతిరాయ్** ప్రభృతులు

ఇక **తెలుగువారిలో**

11. ఆంధ్రా డెమొస్తనీస్ గా పేరొందిన చెరకువాడ నరసింహం పంతులు
12. రాజకీయవేత్తలు కాని తెలుగువారిలో వేలాది ఉపన్యాసాలతో శ్రోతల్ని అయస్కాంతం లా ఆకర్షించి ఆంధ్ర సిసిరోగా పేరొందిన తుర్లపాటి కుటుంబరావు – ప్రభృతుల టేప్ చేసిన ప్రసంగాలను నిశితంగా పరిశీలించిన పురందేశ్వరి – ఇటు లోక్‌సభ, రాజ్యసభ అటు అంతర్జాతీయ వేదికలపై అతివేగంగా దృష్టి సారించింది.

ముఖ్యంగా తమిళనాడు ముఖ్య మంత్రిగా ఒక సరికొత్త చరిత్ర సృష్టించి రాజ్యసభలో ప్రప్రథమంగా తన ఇంగ్లీషు భాషా నైపుణ్యంతో జయలలిత చేసిన ప్రసంగం సభికులంతా మిన్ను ముట్టే హర్షధ్వానాలు –

ప్రత్యేకంగా ఇందిరాగాంధీ అభినందించడం దీనికి తోడు మరో పుటలో మరో సంఘటన పురందేశ్వరిని సంభ్రమా శ్చర్యాలకు గురిచేసింది.

అది 1946వ సంవత్సరం. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశం, దక్షిణాఫ్రికాలో భారతీయుల పట్ల అక్కడ శ్వేత జాత్యహంకార ప్రభుత్వం ప్రదర్శిస్తున్న వర్ణ వివక్షతను చీల్చిచెండాడుతూ విజయలక్ష్మి పండిట్ చేసిన చారిత్రాత్మక ప్రసంగం. హర్షధ్వానాలు, అభినందనల వెల్లువ.

అన్నిటికంటె సంభ్రమాశ్చర్యాలతో ఉక్కిరిబిక్కిరి చేసి చరిత్రలో సువర్ణాక్షరాలతో వన్నెకు, వాసికెక్కిన సంఘటన ఈ సందర్భంలో స్మరించుకోవడం తప్పదు సుమా. విజయలక్ష్మి పండిట్ అంతసేపు ఎవరినైతే చీల్చి చెండాడిందో ఆ దక్షిణాఫ్రికా ప్రధాని 90 సంవత్సరాల పండుముసలి ''జనరల్ జాన్‌స్మట్స్'' విజయలక్ష్మి పండిట్‌ను కౌగిలించుకొని నువ్వు నా మనుమరాలి వంటిదానివి. నువ్వు భవిష్యత్తులో ఉన్నత పదవులు అధిష్టిస్తావు. ఒక్క మాటలో చెప్పాలంటే యీ సభకే అధ్యక్షురాలు కాదగిన అర్హత నీకు సంపూర్ణంగా వుంది అంటూ ఆమెకు ప్రశంసల వర్షం.

అప్పటికి 40 సంవత్సరాల వయస్సులో వున్న విజయలక్ష్మి పండిట్, తర్వాత 7 సంవత్సరాలకే ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీకి అధ్యక్షురాలుగా ఎంపికైంది. మరో విచిత్రమేమంటే ఆ ప్రపంచ సంస్థకు అధ్యక్షురాలైన తొలి మహిళా మణిగా చరిత్ర పుటలకెక్కింది. యీ సంఘటన పురంధేశ్వరి పురోగతి సరికొత్త బీజం పడింది కూడా ఇక్కడే.

**చదువుకున్న స్త్రీ అవకాశం వస్తే పురుషుల కంటే మిన్నగా రాణిస్తారనేది పురంధేశ్వరి తన పూర్వాశ్రమంలోనే ఉగ్గుపాలతో నేర్చుకొంది.**

ప్రాచీన భారత చరిత్రను మరోసారి పురందేశ్వరి మనః ఫలకం పై శిలాక్షరంగా చోటు చేసుకుంది.

**1. ఒక గార్గి**
**2. ఒక మైత్రేయ**
**3. ఒక విజ్జిక**

ముఖ్యంగా మండనమిశ్రుని భార్య ఉభయ భారతి శాస్త్ర పాండిత్యంలో తనతో బహిరంగ చర్చకురావలసినదిగా సవాల్ చేసింది ఆదిశంకరాచార్యుణ్ని. **ప్రతిభ ఉంటే చాలదు, అది రాణించడానికి ప్రదర్శించడానికి సమయం, సందర్భం గూడా కలిసి రావాలి.**

క్రీ.పూ. మహావక్త, అఖండ ప్రతిభా శాలి, సిసిరో, మాటల్ని పురందేశ్వరి ఎల్లప్పుడు స్మరిస్తూ ఉంటుందిసుమా.

తత్ఫలితంగా తొలిసారిగా తన మాదిరిగా పార్లమెంటుకు ఎంపికైన

**1. రాహుల్ గాంధీ**
**2. జ్యోతిరాదిత్య సంధియా**
**3. సచిన్ పైలట్**
**4. జితిన్ ప్రసాద్**
**5. మిలిందదేవర్**
**6. నవీన్ జిందాల్**
**7. తేజస్వి** – ప్రభృతులు, ఏ యే రంగాలలో ఎంత పట్టువుందో అంచనా వేసింది.

“పాలిటిక్స్ కంటె మిన్నగా పాలిట్రిక్స్ గూడా నడుస్తున్నాయని, రాజకీయాలలో అర్హత కంటె అనర్హత ఎందుక రాజ్యం చేస్తుందో అహో రాత్రుళ్ళు ఆలోచన చేసింది.

ఎందుకో పురందేశ్వరి మనః ఫలకంపై మహాకవి శ్రీశ్రీ మహాప్రస్థానం లోని

**సికిందరో, గజనీ, గోరీ ఎవడైతేనేం**
**కాలానికి కట్టిరికత్తుల వంతెన**
**ఇతిహాసపు చీకటి కోణం**




**విజయలక్ష్మిపండిట్**



**ఇందిరాగాంధీ**



**జయలలిత**

**అట్టడుగున పడి కాన్పించని**
**కథలన్నీ కావాలిప్పుడు**

అనే గేయం కలలో, కలరవాన్ని సృష్టించిన కలకలాన్ని రేపింది. వెంటనే ప్రాచీన భారతం వైపు పురందేశ్వరి పరుగులు తీసింది. తత్ఫలితమే –

1. ఇత్తిష్ మిష్ అనే బానిస చక్రవర్తి తన మామగారైన కుతుబుద్దీన్ ఐబక్‌ను వంచించి ఢిల్లీ సింహాసనాన్ని కబళించడం
2. అల్లావుద్దీన్ ఖిల్జీ తన మామ జలాలుద్దీన్‌ను వధించి ఆయన సింహాసనాన్ని కైవసం చేసుకోవడం
3. ఆనాటికి అభ్యుదయవాది, సంఘ సంస్కర్త అక్బర్ అంతఃపురంలోని రాకుమార్తెలకు వివాహం చేయరాదనే ఫర్మానా జారీ చేయడం.
4. తత్ఫలితంగా షాజహాన్ తన కుమార్తెలు
   1. జాహానారా
   2. రోష్‌నారాలకు షాదీ చేయకపోవడం
5. షాజహాన్‌కుమారుడు ఔరంగజేబు, తన అన్నదమ్ములను తుదముట్టించి, తండ్రిని జైలులో బంధించి సింహాసనాన్ని అధిరోహించడం
6. ఆధునిక భారత రాజకీయ చరిత్రలో 1984లో కాశ్మీర్ ముఖ్యమంత్రి ఫారూఖ్ అబ్దుల్లాను ఆయన బావమరిది జి.యం.షా పదవీచ్యుతిణ్ణి చేయడం.



ఈ ఘట్టాలన్నీ పురందేశ్వరి మనః ఫలకంపై కరాళనృత్యం చేశాయి. తత్ఫలితమే పురందేశ్వరి తన సోదరులకు వ్రాసిన లెటర్స్ చివరి భాగంలో –

తండ్రి క్షోభ, ఆక్రోశాన్ని వెళ్ళ గ్రక్కిన మాటలను డిస్క్‌లో పొందుపరచి “నారావారి నరనరాల్లో (చంద్రబాబు) నాగుబాములు నాలుకలు ఎలా చాచి వున్నాయో? డేంజర్, డేంజర్ అంటూ ఒక ఎర్రబల్బు వెలిగించి అటు తండ్రికి తనయుగా, ఇటు అన్నలకు ఆడపడుచుగా తన గురుతర బాధ్యతలు నెరవేర్చి భావితరానికి సరికొత్త దిక్సూచిగా మలుపులో నిలబడ్డ ఒక ఆదర్శ మహిళామణిగా నిలువుటద్దంలో నిటారుగా నిలబడింది.

గతం గతః

బహుముఖమైన తన ప్రతిభను నిర్విరామంగా, నిత్య నూతనంగా తీర్చిదిద్దాలని, నిదురలేనిది, బెదురు లేనిది తన గళానికి మెరుగులు దిద్దింది.

కమ్యూనిస్ట్ పార్టీ సిద్ధాంతకర్త కారల్‌మార్క్స్ ఆధునిక ఇటలీ నిర్మాత మాజినీని, భారత రాజ్యాంగ నిర్మాత భీమ్‌రావ్ అంబేద్కర్‌ను తీర్చిదిద్దిన బ్రిటీష్ మ్యూజియం గ్రంథాలయం ఆమె మదిలో మెదిలింది.

వెంటనే పార్లమెంటు గ్రంథాలయానికి పయనమయింది. గతంలో పార్లమెంటులో తన ప్రసంగాలతో ప్రగాఢముద్ర వేసిచరిత్ర పుటలలో సువర్ణాక్షరాలతో చిరస్థాయిగా నిలిచిన

1. **ఒక అన్నాదురై**
2. **ఒక జార్జి ఫెర్నాండజ్**
3. **ఒక ఫిరోజిగాంధీ**
4. **ఒక సి. సుబ్రహ్మణ్యం**
5. **ఒక హెచ్.వి. కామత్**
6. **ఒక యన్.జి.రంగా**
7. **ఒక భూపేష్ గుప్తా**
8. **ఒక హీరేక్ ముఖర్జీ**
9. **ఒక ఎ.కె. గోపాలన్**
10. **ఒక రేణూ చక్రవర్తి**
11. **ఒక వాజ్‌పేయి**
12. **ఒక మధుదండాపతే**
13. **ఒక కృపలానీ**
14. **ఒక పుచ్చలపల్లి సుందరయ్య**
15. **ఒక గురుదాస్ గుప్తా**
16. **ఒక బృందాకారత్**

ప్రభృతుల రికార్డ్ చేయబడిన ప్రసంగాల పరిజ్ఞానాన్ని పసిగట్టింది.

భారత స్వాతంత్ర్యానంతరం – ఏ విదేశాంగ శాఖ మంత్రి, ఏ ప్రధానమంత్రి, ఐక్యరాజ్య సమితిలో భారత జాతీయ భాష హిందీలో తమ తమ ప్రసంగాలు చేయలేకపోయారు.

అయితే అతుల్ బిహారీ వాజ్‌పేయి

1. 1978లో భారత విదేశమంత్రి హోదాలో
2. 1998 లో భారత ప్రధానిగా
3. 2000 సం॥లో యు.యన్.ఒ.57 వ సమావేశంలో 3వ సారి హిందీలో ఆయా సమస్యలపై 7 గంటల 32 నిమిషాలు ఉపన్యసించి హ్యాట్రిక్ సృష్టించిన విషయం పురందేశ్వరి పసిగట్టి ఆ స్క్రిప్టు లను స్టడీ చేసింది.
4. వాజ్‌పేయి కార్గిల్ వార్‌లో జాతిని నడిపించిన తీరు ?

ప్రతి భారతీయ పేరుని గుండెల్లో దేశభక్తిని నింపిన వైనం,


5. సరిహద్దులో కదనరంగంలో అహోరాత్రుళ్ళు పోరు సల్పుతున్న జావాన్‌లకు సంఘీభాదం తెలుపుతూ, ప్రతివూరు, ప్రతివాడ, ప్రతిపల్లె నుండి (లడో, లడో, ఆగేబఢో, ఆగే బఢో, పీఛే నముడో. హమ్ సబ్ ఆప్‌కే సాధ్ హై)

(వెనుతిరగకు, ఎదిరించు, ఎదిరించు, ముందుకు సాగు, ముందుకు సాగు, మీకు అండగా దండిగా, మేమున్నాం) అంటూ


కన్యాకుమారి నుండి కాశ్మీరం వరకు ఇటు హిందీలోను అటుఇంగ్లీషులోనూ, ఉద్రేకంగా, ఉక్రోషంగా ఉత్సాహంగా ప్రతి పేరుని స్వహస్తాలతో వుత్తరాలు వ్రాయించిన తీరు పురంధేశ్వరి అధ్యయనం చేసి – నిండు మనస్సుతో కులం, మతం, వర్ణం, వర్గం, సంకుచిత రాజకీయాలకతీతంగా వాజ్‌పేయికి జేజేలు పలికింది.




అన్నా దొరై



శ్రీశ్రీ




వాజ్‌పేయ్



**రోమన్ తత్వవేత్త సిసిరో**



**బి.ఆర్. అంబేద్కర్**



**జవహర్‌లాల్ నెహ్రూ**

వారిద్దరూ నిలువుటద్దంలో నిటారుగా ప్రత్యక్షమై - పురందేశ్వరి ని ఆశీర్వదించినట్లనిపించిందట.

చైనా ఇండియాలమధ్య యుద్ధం జరుగుతూ ఉంది. మాక్ మెహన్ రేఖ - సరిహద్దు సంఘర్షణలు - పార్లమెంటులో ఆనాటి ప్రధాని నెహ్రూ హెచ్.వి. కామత్‌ల మధ్య జరిగిన కొశ్చన్ దానికి కౌంటర్‌ను చదివింది.

మాక్ మెహన్‌రేఖ పరిసరాల్లో వందలాది ఎకరాలలో గడ్డిపీచు గూడా మొలకెత్తదు. ఇక్కడ యీ ప్రతి పక్షం ఎందుకు యీ రగడ చేయడం, నాకు అర్థం గావడం లేదని ప్రధాని ప్రతిపక్షానికి ఒక కొశ్చిన్? ప్రతి పక్షస్థానంలో వున్న హెచ్.వి. కామత్ నిలబడి నీ బట్టతలపై వెంట్రుకలు లేవుగదా? నీకు యీ హెడ్ ఎందుకంటున్నాను అనేది కౌంటర్? పండిట్ జీ స్థాణువులా నిలబడి పోయాడట. వారిద్దరి మధ్య జరిగిన పోరు, తీరును సునిశితంగా సూక్ష్మ దృష్టితో ఆలోచన చేసిందట పురంధేశ్వరి.



తత్ఫలితమే – 2004 మార్చి 14న కాంగ్రెస్‌లో చేరి బాపట్ల ఎం.పి.గా విజేతగా పార్లమెంట్‌లో తొలి అడుగు పెట్టినప్పటి నుండి తన కృషిని ప్రారంభించింది. (1) పార్లమెంట్ (2) ప్రజాసేవ – యీ రెండూ తన కళ్ళ ముందు ప్రధానాస్త్రాలుగా కనిపించాయి.

చెన్నై సెక్రెడ్ హార్ట్ హైస్కూలు ఇంగ్లీషు – బి.ఎ. లో జమాలజీ శిక్షణ లో గతం నిష్ణాత సంతరించుకున్న పురంధేశ్వరి ఈనాడు –

**పార్లమెంటులో**

1. **వ్యవసాయం**
2. **సైన్సు, సాంకేతిక రంగం**
3. **ఆరోగ్యం, విద్య**
4. **మాతాశిశు సంరక్షణ**
5. **ప్రకృతి – సహజ విపత్తులు**
6. **చేతివృత్తులు**
7. **చేనేత కార్మికులు**
8. **గర్భస్థ – స్త్రీ – శిశువుల భ్రూణహత్యలు**
9. **బయోటెక్నాలజీ**
10. **ఆక్వాకల్చర్** మొదలైన అనేక సమస్యలపై అనర్గళం గా ప్రసంగించి – ఆసేతు హిమాచలం వరకు ప్రతిధ్వనించే కరతాళధ్వనులు మిన్నుముట్టాయి.

ప్రజాసేవ :

1. 1000 కోట్ల రీ షెడ్యూల్డ్ రుణాల వడ్డీ మాఫీకై నభూతో నభవిష్యతిగా కృషి చేసింది.
2. గత ఏడాది గణతంత్ర దినోత్స వం నాటి నుండి కొందర్ని ఆదర్శ రైతులుగా ఎంపిక చేసి ప్రప్రథమంగా పద్మశ్రీ అవార్డులం దజేసిన ఘనత పురంధ్రేశ్వరిదే.
3. వరి మద్దతు ధర పెంపు విషయం
4. కాబూలీ శనగలు, బియ్యం, ఎగుమతుల కోసం కృషి
5. ఆగిపోయిన ఎత్తిపోతల పథకాల న్నిటిని పునరుద్ధరణ
6. అంబికా సోనీ చుట్టూ విసుగు విరామం లేకుండా తిరిగి, తిరిగి, ఎట్టకేలకు తెలుగు భాషకు ప్రాచీన హోదా లభింప జేయడం
7. మానాన్న యన్.టి.ఆర్.కు నిజమైన వారసుడు రాజశేఖర రెడ్డి గారేనని సోదాహరణంగా నిరూపించి కలకలం సృష్టించడం రామారావు గారి మాదిరిగానే రాజశేఖర్ రెడ్డి రైతుల సంక్షేమం కోసం

1. ఉచిత విద్యుత్ ఇవ్వడం
2. సాగునీటి వసతిని పెంచడం
3. పక్కా గృహాల నిర్మాణం
4. మహిళలకు పావలా వడ్డీకే రుణాలివ్వడం
5. కిలో బియ్యం పేదలకు 2 రూపాయలకే యివ్వడం
6. ఆరోగ్య పథకం
7. విద్యార్థులకు మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించారు




నిర్మొహమాటంగా, నిష్పక్షపాతం, ఖరాఖండితంగా చేసిన పురందేశ్వరి ప్రకటనలో టి.డి.పి.లో ప్రకంపనలు సృష్టించింది.

ప్రసంసల వెల్లువలో మన తెలుగింటి ఆడపడుచుకు అభినందనలు

పార్లమెంట్‌లో మహిళలు పడుతున్న పాట్లు, వేధింపులు, ఈసడింపులపై చర్చలో పాల్గొన్న పురందేశ్వరి

భావానుగుణంగా, తన మృధుమధురమైన స్వరంతో తన ఆంగ్ల భాషా ప్రావీణ్యంతో హృద్యంగా చేసిన ఉపన్యాసం సోనియాగాంధీ పార్లమెంట్‌లో ఎదురుగా వెళ్ళి ప్రత్యేకంగా అభినందించింది. గతంలో ఎ.ఐ.సి.సి. అధ్యక్షురాలు సోనియా గాంధీతో ఒంగోలు నుండి హెలికాప్టర్‌లో ప్రక్క సీటులో కూర్చొని ఢిల్లీకి పయనించిన తొలి తెలుగు మహిళ పురందేశ్వరి అనే సంగతి యీ సందర్భంలో మరువగూడని మరుపరాని విషయం సుమా.

పార్లమెంట్‌లో వ్యవసాయ రంగంపై ఆమెచేసిన ప్రసంగం ఆశ్చర్య చకితుడైన వ్యవసాయ మంత్రి శరద్‌పవార్ ఒక చీటీ పై అభినందిస్తూ ఆమెకు అందజేశాడు సుమా.

ప్రపంచ ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త డా॥ యం.యస్. స్వామినాధన్ ఆమె వ్యవసాయశాఖ మంత్రి అయి వుంటే దేశం ఇంకా ఎక్కువ ప్రయోజనం పొంది వుండేదని ప్రశంసించారు మరి.

మంత్రివర్గంలో పురందేశ్వరి వుండడం నాకు చాలా గర్వంగా ఉంది. నా మంత్రి వర్గానికి ఆమె కొండంత అండ. పార్లమెంట్‌కే గ్రేట్ ఎస్సెట్ అంటూ ప్రధాని మన్మోహన్ సింగ్ వ్యాఖ్య.

పురందేశ్వరి లాంటి ఆదర్శ అంకితరాజకీయవేత్త లుండడం దేశానికే గర్వకారణం – ఆనాటి పార్లమెంట్ స్పీకర్ సోమనాథ్ ఛటర్జీ వువాచ.

30 అంతర్జాతీయ వేదికలపై భారత వాణిని వినిపించిన వినిపించక పురందేశ్వరిని విదేశాంగ సహాయ మంత్రిణిగా గతంలోనే నియమించి వుండవలసినది.

అంతర్జాతీయ దౌత్య నీతి మరింత రాణించి వుండేది సుమా. ఆమెది మెయిడె రోలింగ్ అంటే మనదేశం తరఫున సంచార రాయబారిగా యిప్పటికైనా నియమిస్తే బాగుంటుంది. యీ విషయంపై ప్రధానికి వుత్తరం గూడా వ్రాస్తున్నాను. ప్రఖ్యాత జర్నలిస్ట్ తొలి పద్మశ్రీ గ్రహీత, తుర్లపాటి కుటుంబరావు వాక్కు

2004–2005 లో పురంధ్రేశ్వరి బెస్ట్ పార్లమెంటేరియన్ అవార్డ్

నేడు ఆమె ప్రపంచానికే ఎంతో అవసరం – బిల్ క్లింటన్, లారాబుష్ ల వువాచ

టైమ్స్ ఆఫ్ ఇండియా ఉత్తమ, ఆదర్శ

మంత్రిణిగా ఎంపికచేసింది. ముఖ్యంగా యీ దగ్గుబాటి పురందేశ్వరి రైజింగ్ స్టార్ అంటూ పతాక శీర్షిక లో పట్టం కట్టింది.

ఒక్కమాటలో చెప్పాలంటే వైట్ హౌస్‌లో ప్రపంచ అక్షరాస్యతపై చేసిన ప్రసంగాన్ని అమెరికన్ పత్రికలన్నీ ప్రశంసించాయి. ముఖ్యంగా అక్షరాస్యత అన్నది మానవ జన్మ హక్కు అని యీ విషయం 50 సం॥ల క్రితమే ఐక్యరాజ్యసమితి ఆమోదించిన తీర్మానాన్ని చదివి వినిపించి సభికుల హర్షధ్వానాల మధ్య కలకలం సృష్టించింది.

అదే విధంగా మహాకవి శ్రీశ్రీ పొరుగుదేశం లో ఒక సందర్భంలో

**తెలుగువాడి తెలివితేటలకు జైజై**
**తెలుగు వాడు దేనికైనా సైసై**
**తెలుగువారి నెదురు వాడు నై నై**
**తెలుగునాట కవుల పాట హై హై**
**ప్రస్తుతానికి వస్తామని నైస్తం – బై బై**

అనే గేయాన్ని చదివి వినిపించి మంగళ హారతులందుకున్నారు సుమా.

ఏదీ ఏమైనా

జెనీవాలో అంతర్ పార్లమెంటరీ యూనియన్ ఐ.పి.యు.

మాల్దీవులలో కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్

జపాన్, జర్మనీలలో వాణిజ్య, పారిశ్రామిక అధికారులతో అర్థవంతమైన చర్చలు జరిపేందుకు భారత బృందంతో పర్యటన

మాస్కోలో విద్యపై – జి – 8 మంత్రివర్గం సమావేశం

కైరోలో (ఈజిప్టు) ఇ.ఎఫ్.ఎ. గ్రూపు వున్నత స్థాయి ఆరవ సమావేశం

దక్షిణాఫ్రికాలో, విద్య, శిక్షణ, అభివృద్ధి కోసం ఐ.సి.టి. పైన ప్రథమ పాన్ ఆఫ్రికా సదస్సు

కౌలాలంపూర్‌లో భారత దేశం, మలేషియా వైస్ ఛాన్సర్ల సదస్సు

నేపాల్‌లో "రాజకీయాలలో మహిళలపై హింస" దక్షిణాఫ్రికా ప్రాంతీయ సదస్సు

జెనీవాలో జరిగిన అభివృద్ధి, అవకాశాలు ప్రపంచీకరణ పై అంతర్ పార్లమెంటరీ యూనియన్ 117 వ సదస్సు

లండన్‌లో విద్యా రంగంలో సాంకేతిక విజ్ఞానంపై ప్రపంచ స్థాయిలో మంత్రుల సెమినార్

భారతదేశం లో చక్కెర వ్యాధిగ్రస్తుల అంతర్జాతీయ సదస్సు

హైదరాబాద్‌లో కంటి వైద్య నిపుణులు అంతర్జాతీయ సదస్సు

అభివృద్ధి, విద్య, శిక్షణ నిమిత్తం ఐ.సి.టి. పై జరిగిన తొలిపాక్ ఆఫ్రికన్ సమావేశం

బయో, నానో టెక్నాలజీపై జరిగిన 5వ వార్షిక విశ్వవిజ్ఞాన శతాబ్దివార్షిక సమ్మేళనం

ఆసియా – ది – పసిఫిక్ ప్రాంతంలో సమానత్వం – ఆచరణ – యోగ్యమైన సమాజనిర్మాణం అనే అంశంపై జరిగిన ఆసియా – ఫసిపిక్ ప్రాంత కాన్ఫెన్సియా – 4 సన్నాహక సమావేశం లో పాల్గొని ప్రపంచాన్ని పదే పదే ఆకర్షించారు.

కేవలం 6 సం॥ల క్రితం రాజకీయాలలో అడుగిడినప్పటికి వున్నత విద్యాపరిజ్ఞానం, చక్కని సంస్కారం ఇంగ్లీషు, హిందీ, తెలుగు, తమిళం అనర్గళంగా మాట్లాడే ఆమె అనతాకాలంలోనే అంచెలంచెలుగా పైకి ఎదిగి అంతర్జాతీయ స్థాయిలో తన ముద్ర వేయడమనేది తెలుగింటి ఆడపడుచు అని మనమేగా ఆసేతు హిమాచలం అంబరాన్నంటే సంబరాలు చేసుకుంది సుమా!

శ్రమించే ప్రతిభాశాలురకు ఒక విజయం, మరో విజయానికి, ఒక పదవి, మరో పదవికి సోపానలలవుతాయి. నెపోలియన్

క్రమశిక్షణతో, ప్రణాళికా బద్ధంగా వ్యవహరించే వ్యక్తి ఒక గంటో, ఒక రోజో, ఒక చోటో ఇంకొక చోటో కాదు ఎక్కడైనా సరే, జీవితాంతం విజయాలతో వెలిగి పోతూనే వుంటాడు. ఒజాక్ టేలర్ – సూక్తులు

పురందేశ్వరి మనఃఫలకంపై బలీయంగా ముద్రవేశాయి.


**ఒక్కటి మాత్రం నిజం**
**పురందేశ్వరి ఆంధ్రా నుండి – హస్తినకు**
**కారంచేడు నుండి కాలిఫోర్నియా దాకా**
**ఎర్రకోట నుండి వైట్ హౌస్ దాకా**
**భారత కీర్తి పతాకను రెపరెపలాడించింది**

ఒక సుప్రసిద్ధ హిందీ పాత్రికేయుడు జైన్ పేర్కొన్నట్లు అన్ని రకాల అవకాశమున్నా మూడు పి.లకు ఎంతో దూరంగా వెళ్ళిపోయింది. యీ పురందేశ్వరి

పి. : ప్లాట్‌ఫారం ఎప్పుడూ ప్లాట్‌ఫారం ఎక్కాలని
పి. : ప్రెస్ ప్రతిరోజు పత్రికలో పేరుకనిపించాలని
పి : పిక్చర్ సినిమాలలో నటించాలని
అయితే రెండు పి.లకు మాత్రం – యీ పి దగ్గరగా ఉంటుందట పురందేశ్వరి
పి : పార్లమెంట్
పి : ప్రజాసేవ

**ఒక్క విషయం :**

1952 నుండి నేను హిందీ, తెలుగు పత్రికా పాఠకుణ్ణి ఇటు ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం, గోవా విలీకరణ వుద్యమం, అటు విశాఖ ఉక్కు వుద్యమాలలో ప్రత్యక్షంగా విద్యార్థినాయకునిగా పాల్గొన్న వ్యక్తిని. 4 దశాబ్దాల హిందీ ఉపాధ్యాయునిగా రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాలలో 30 అవార్డులు అందుకొన్న నేను రేడియో & టి.వి. ఆర్టిస్టను నేను నా విధ్యుక్త ధర్మంగా భావిస్తూ చిన్నమ్మకు చిన్నతనంలో తీర్చిదిద్ది ఆంధ్రకు అన్ని హంగులతో ఆడపడుచుగా సాగనంపిన చెన్నైలోని సేక్రెడ్ హార్ట్ హైస్కూలు ఆనాటి ఉపాధ్యాయులందరికి నా పాదాభివందనాలు.



రచన :
**వలేటి వెంకటేశ్వర్లు,**
రాష్ట్రపతి అవార్డు గ్రహీత

కవిత

# పురంధీశ్వరులకు శుభాకాంక్షలు



ఆకాశాన మలయమారుతం
భూమార్గాన నదీసోయగం
పున్నమి వెన్నల్లో అలరారే తేజోరూపం
సముచిత చేతలతో ఎదురీదటం
సమయస్ఫూర్తితో పోరాడటం
ధీరవనితకు అంకిత భావం
మనోహరమూర్తికి ఆత్మవిశ్వాసం
ప్రతిచర్యలోనూ మీ గుండె చప్పుడు ప్రస్ఫుటం
మీ అడుగుల ఉరుములు ప్రజాభిమతం
మీ ఆలోచనాధోరణి జనహితం

నీతినిజాయితీలకు మీరు నిలువెత్తు నిదర్శనం
జాతి మృదయాంతరాలలో పరిమళిస్తుంది...
మీ మంచితనపు సుగంధం
అరిషడ్వర్గాలు
మా చిన్నమ్మకు ఆమడదూరం
సంకుచితరాజకీయాలు
ఆ జంటకు అందనంత దూరం
నీతి తప్పని సద్గుణం
కపటం లేని మనస్తత్వం
మంచిని కోరే జీవనతత్వం
ఆ పురంధరేశ్వరులకు సదాస్మరణీయం

సమస్యలపై సమగ్ర అవగాహనం
పరిష్కారంకోసం నిరంతర అధ్యయనం
కర్షకలోకం కళ్లల్లో... ఆనందం
శ్రమజీవుల బ్రతుకుల్లో సంతోషం
శ్రమైక సౌందర్యానికే ప్రాధాన్యం
ప్రజాహితం కోసం నిరంతర పోరాటం
సమాజ శ్రేయస్సే మీ ధ్యేయం
"ఈశ్వరుని" కోసం విప్లవ సంకేతం
చిన్నమ్మ రూపం నిశ్శబ్ద విప్లవం
పోరాడగల దమ్ము ధైర్యం మీ సొంతం
అరుదైన నాయకత్వమే మీ పంతం
అలుపెరుగని యోధులు మీరు
"ఎవ్వరైనా" మీ ముందు బలాదూరు

అపూర్వమైన సాహసకృత్యం మీది
అద్వితీయమైన ప్రోత్సాహక శక్తి మాది
మీ మహత్తర విజయాల వెనుక ....
నిక్షిప్తమై వుంది... అసాధారణ ఆత్మశోధనం
నిబిడీకృతమైవుంది... అచంచలమైన ప్రజావిశ్వాసం
రాచరికాన్ని మరిపించే మా చిన్నమ్మ రాజసం
జాతిని మురిపించే తేజోవిరాజితమైన ఆ వదనం
రాజకీయ ఉద్దండులను సైతం అట్టే.. నిలబెట్టే...
చెక్కుచెదరని గాంభీర్యం
వాచికం ... వాక్చాతుర్యం...
మేధాశక్తి... పాలనా సామర్థ్యాలతో...
ఉషోదయంతోనే...
మిట్టమధ్యాహ్నపు మార్తాండుని మరిపించి
తెలుగువారి కీర్తిని .... మనదేశపు ఖ్యాతిని
దశదిశలా మార్మోగించి

'అన్న' సత్తా నిరూపించిన అపూరూప మహిళవు
మెరుపుతీగవై.. వెలుగుతున్న తెలుగు బిడ్డవు
యువతకు స్ఫూర్తివై... మానవతకు దీప్తివై
రాజకీయాలలో కొంగ్రొత్త ఆవిష్కరణలకు క్రాంతివైతివి.

ప్రజాజీవితంలో మీ జన్మపునీతం
'అన్న' వారసత్వంలోనే మీ జీవన సాఫల్యం
సన్నజాజుల పరిమళం... మంచితనపు మానవత్వం
గండు మల్లియల గుభాళింపు... పరోపకార పరాయణత్వం
మీరడుగిడిన చోటల్లా వెల్లివిరియు చిరుదరహాసం
చిలకా గోరింకల మనోగీతికలు సమ్మోహనం
ప్రజాసేవకై మీ పరితాపం... ముగ్ధమనోహరం
సువర్ణాక్షరాలత లిఖించదగిన మహోజ్వల ఘట్టం

మీరాక చరిత్రలో ఓ సుందర స్వప్నం
తెనుగుదేశాలన మీ ప్రస్థానమొక మనోజ్ఞ కావ్యం
అందుకోండి... మా నూతన సంవత్సర శుభాకాంక్షలు
నెరవేరాలి.. మనందరి సంక్రాంతి పండుగ ఆకాంక్షలు



**– తోటకూర వేంకట నారాయణ, కార్యదర్శి**
**– డా॥ తోటకూర ప్రభాకరరావు, అధ్యక్షులు**
**తోటకూర రామకోటయ్య కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్**
గణపవరం, చిలకలూరిపేట, సెల్: 9849613013.

❄ ❄ ❄ ❄ ❄

సినిమా

# హాఫ్ సెంచరీ రికార్డుకు దగ్గర్లో సెక్సీనటి త్రిష



హీరోలే కాదు హీరోయిన్లు కూడా హాఫ్ సెంచరీ సినిమాలు చేస్తున్నారు. అయితే ఇది చాలా అరుదు. హీరోలైతే దానికి పెద్ద బిల్డప్ ఇచ్చి ప్రచారం చేసుకుంటారు. హీరోయిన్లు వాటిని పెద్దగా పట్టించుకోరు. కానీ త్రిష మాత్రం ఇండస్ట్రీకి వచ్చి 12 ఏళ్ళయింది.

తాజాగా వెంకటేష్‌తో 'బాడీగార్డు' చిత్రం చేసింది. అది సంక్రాంతికి విడుదలయ్యింది. తర్వాత 'దమ్ము' చిత్రంతో ముందుకు రాబోతుంది. దీంతో తమిళ, తెలుగు చిత్రాలు కలిపి మొత్తం 45 సినిమాలు అయ్యాయి. ఇలా వచ్చి అలా వెళ్ళిపోతున్న నేటి ట్రెండ్‌లో దాదాపు 50 సినిమాలకు దగ్గరగా రావడంతో ఆమెతో సినిమాలు పూర్తిచేయడానికి పలువురు ముందుకు వచ్చారు. దీంతో ఆమె 50 సినిమాలు త్వరలో పూర్తవుతాయన్నమాట.

# ఇక నుంచి నేను చూపించను గాక చూపించను - తాప్సీ




ఎక్స్‌పోజింగ్ చేసే తాప్సీకి విసుగెత్తిందో ఏమోగానీ ఇక నుంచి లంగా, ఓణి పాత్రలకే పరిమితవుతానంటుందట. 'ఝుమ్మంది నాదం'చిత్రంతో తెరంగేట్రం చేసి గ్లామర్ అందాలను సాధ్యమైనంత వరకూ ఎక్కువగా ప్రదర్శించిన తాప్సీకి చెప్పుకోదగ్గ 'బ్రేకులు' రాలేదు. దీంతో ఆ అందాల ప్రదర్శన కు ఫుల్ స్టాప్ పెట్టేయాలను కొంటుందట. అంతేకాదు. మంచు లక్ష్మీప్రసన్న నిర్మిస్తున్న 'గుండెల్లో గోదారి' చిత్రంలో అచ్చమైన తెలుగమ్మాయిగా లంగా, ఓణితో నటిస్తున్నదట. ఈ చిత్రంలో సరళ పేరుతో నటిస్తున్న తాప్సీ ఆ పాత్ర తనకు గంపెడు అవకాశాలను తెస్తుందని ఖుషీగా చెపుతుంది. గ్లామర్ ఇండస్ట్రీలో గ్లామర్ అందాలను చూపకుండా తాప్సీ ఎలా నెట్టుకొస్తుందో చూడాల్సిందే.



# రజనీకాంత్‌కు దడపుట్టిస్తున్న అల్లుడు ధనుష్

అల్లుడు ధనుష్... ఏదో కొలవెరి పాటతో ప్రపంచ వ్యాప్తంగా పాపులర్ అయ్యాడనుకొంటే అల్లుడు కాస్తా మెరుపుతీగ శృతిహాసన్‌తో గిల్లుడు వ్యవహారంలో వుంటున్నాడన్న వార్త మామ రజనీకాంత్‌కు ఆందోళన కలిస్తున్నది. దీంతో రజనీకాంత్ నేరుగా ధనుష్ తండ్రి కస్తూరి రజాతో అబ్బాయి ధనుష్ సంగతి కాస్త చూడమని చెప్పాడంట. అంతే కస్తూరి రాజా ధనుష్‌ను క్లాస్ తీసుకొన్నట్లు భోగట్టా. ఏదో హిట్ చిత్రం తీద్దామని రోమాంటిక్ గా నటించమని ధనుష్ భార్య ఐశ్వర్య ఛాన్స్ ఇచ్చినందుకు అల్లుడు నిజంగానే రొమాన్స్ చేసే దాకా వెళ్ళడంపై రజనీకాంత్ కాస్తంత ఆవేదన చెందుతున్నట్లు సమాచారం.

స్వప్నం

# స్వప్నములు [కలలు] వాటి ఫలితములు



**గంటా సాయిబాబా,** వాస్తు పరిశోధకులు, సిద్ధాంతి.
సెల్ : 9848340130

**పాఠకులకు మనవి : ఈనెల నుండి స్వప్నములు వాటి ఫలితములు గురించి పాఠకుల అభ్యర్థన మేరకు వ్రాయుచున్నాను. వాస్తు సరిలేని గృహములందు మలిన బట్టలు ధరించుట వలన పరుండు మంచము అన్య జాతులచే చేయబడిన భయంకర సంఘటనలు చూచిన, వినిన, రాత్రులందు ఇతర ప్రదేశములు తిరిగి కాళ్ళు శుభ్రపరచుకొనక పరుండిన వచ్చు కలలు భయభీతిని కలిగించును. ఇవి చెడు స్వప్నములుగా భావించి, 'సహస్ర పరమాదేవి' శ్లోకమును చదువుకొని మరలా నిద్రించిన చెడు స్వప్నములు రావు. ప్రస్తుతము సు స్వప్నములు గురించి మాత్రమే వ్రాయుచున్నాను.**

**స్వప్నములు (కలలు) వాటి ఫలితములు**

**స్వప్నములు ఏడు రకములుగా విభజింపబడినవి**

(1) దృష్ట (2) శ్రుత (3) అనుభూత (4) ప్రార్థిత (5) కల్పిత (6) భావ (7) దోష, స్వప్నములుగా విభజించబడినవి.

**ఫలితములు లేని స్వప్నములు :**

అనారోగ్యముతో వచ్చు కలలు, నీరసము వలన వృద్ధాప్యము వలన, అతి విచారము వలన, భయము వలన, ఆకలి బాధ వలన శరీర పటుత్వము లేనందువలన, మూత్ర పురీషములు ఆపుకొనలేని స్థితి వలన, జ్వరము, పైత్యము, అజీర్ణము వలన వచ్చు స్వప్నములకు ఫలిత ములు ఉండవు.

ఇవి : దృష్ట, శ్రుత, అనుభవ, ప్రార్థిత, కల్పిత అను పంచవిధ స్వప్నములుగా భావించవలయును.

**భావ, దోష స్వప్నములు (మంచి – చెడు) గురించి తెలుసుకొందాం.**

దుష్ట స్వప్నములు వచ్చినప్పుడు ఈ క్రింది శ్లోకము చదివి, పచ్చ గరికను (ఆకు) నెత్తిన ఉంచుకొని 'ఓం నమః శ్శివాయ' అని పఠించి గరికను వెనుకకు విసిరి వేయవల యును. దీని వలన మృత్యు దోషము హరించుటయే కాక మంచి ఫలితములు ఇచ్చును.

'సహస్ర పరమాదేవి శతమాలా శతాంకురా సర్వం హరతు మేపాపం దుర్వాదుస్వప్న నాసినీ' అని పై శ్లోకమును పఠించవలయును.

**కొన్ని శుభ స్వప్నములు :** సూర్యుని చంద్రుని కలలు వచ్చిన ధనలాభము, జీవితములో మంచి అభివృద్ధి సమస్త కష్టములు తొలగిపోయి సర్వత్రా జయప్రదముగా ఉండును.

ఇంద్ర ధనస్సు కలలో కనిపించిన ధనలాభము.

అప్సరసతో సంభోగించిన శత్రుజయము

ఆవు, ఎద్దు, ఏనుగు, దేవతా గృహములు, గుళ్ళ, గోపురములు, రాజభవనములు, పర్వతములు, వృక్షములు ఎక్కినట్లువచ్చుట, మలినమును శరీరమునకు పూసుకొనినట్లు కలవచ్చుట, వరుసకాని స్త్రీతో రమించినట్లు కలవచ్చుట, తాను ఏడ్చినట్లు, చనిపోయినట్లు కలవచ్చిన



మింగినట్లు కనిపించిన ఉద్యోగప్రాప్తి. అధికారము కలుగును. తను విద్య అభ్యసించునట్లు, దేవతా ఉత్సవములు చూచినట్లు, పండిన చేలో తిరుగుచున్నట్లు, పూలతోటలో విహరించినట్లు, బంగారు వస్తువులు కానీ నాణెములు కాని కనబడినట్లు, కలలో కన్య (పెండ్లికాని) కనిపించినట్లును, తల్లి, తండ్రి పెద్దలు, తెల్లని మేఘములు, స్వచ్ఛమైన మంచినీటిని, వాటిని త్రాగినట్లును, నూతి నుండి నీళ్ళు తోడినట్లును సకల వాయిద్యములతో సంగీతము వినినట్లును, అతి త్వరలో ధనలాభము కలుగును. కష్టములు తొలగి అభివృద్ధి కలుగును.

తెల్లని పాము కుడిచేతిని కరచినట్లు కలవచ్చిన పది రోజులలో ధనలాభము కలుగును. తాను నీటి యందు ఉన్నప్పుడు పాముకాని తేలు కుట్టినట్లు కాని కలలో వచ్చిన తాను చేయుచున్న ప్రయత్నములోను వృత్తిలోను జయము కలుగుట పుత్ర సంతాన ప్రాప్తి కలుగును.

వేడలు, భవనములు, దేవాలయములు, రాజభవనములు,

పర్వతములు మొదలగునవి ఎక్కినట్లును, సముద్రమును దాటినట్లును కలలో వచ్చిన ఎటువంటి దరిద్రుడికైనను త్వరలో రాజభోగములు అనుభవించు దశ కలుగును.

తెల్లకొంగ, తెల్లకోడి, తెల్లబాతు, హంస, ఆడకోడి ఇవి కలలో వచ్చిన వెంటనే మెలుకువ వచ్చినచో అన్యస్త్రీ సంభోగము కలుగును. అట్టి స్త్రీ సౌందర్యవతిగా ఉండును.

తాళ్ళతో చేతులు కట్టబడినట్లు తాను గొలుసు చేత కట్టబడినట్లును కలవచ్చినచో పుత్ర సంతానప్రాప్తి కలుగును. లేదా విశేష ధనలాభము కలుగును.

తాను కూర్చుండు ఆసనము, పరుండు మంచము, వాహనము, తన శరీరము, తన ఇల్లు మండుచున్నట్లు కలవచ్చి వెంటనే మెలుకువ వచ్చినచో త్వరలో ధనలాభము, భూలాభము, గృహలాభము కలుగును.

చంద్రమండలం, సూర్య మండలం గాని కలలో కనబడిన అనారోగ్యముతో బాధపడు వారికి ఆరోగ్యము కలుగును. రోగము లేనివారికి ధనలాభం కలుగను.

రక్తము గాని, సారాగానీ, కల్లుగాని త్రాగినట్లు కలవచ్చినచో విద్యాలాభం. ఇతరులకు ధనలాభం కలుగను.

రధము ఎక్కినట్లు రధము కనబడినట్లు కలవచ్చిన విశేషలాభము కలుగును.

పెరుగు కనబడినను పెరుగు త్రాగినట్లును, నేయి త్రాగినట్లును కలవచ్చినచో కీర్తి కలుగును.

మనుష్యమాంసములు తినినట్లును వండినట్లును కలలో కనబడిన విశేషలాభములు కలుగను.

తన గృహము, నగరము, తగలబడుచున్నట్లు తాను మంటలలో చిక్కుకొని నట్లు కలవచ్చినచో త్వరలో రాజసమానమైన భోగములు అనుభవించెదరు.

కలలో ఆవాలు కనబడిన శుభం. తమలపాకులు, కర్పూరం, అగరు, చందనం, తెల్లని పువ్వులు కనబడినచో విశేషలాభం అభివృద్ధి కలుగును. విశేషధనలాభం కలుగును.

రాజులు, మహాపురుషులు, గుఱ్ఱం,



బంగారు ఆభరణాలు, దేవతలు, బ్రహ్మణులు, గొడుగు, ధాన్యము, పొట్టు, ఊక, పద్మములు, పుష్పములు, తెల్లని వస్త్రములు, అద్దము, మాంసం, పువ్వుల దండలు, అవి ధరించినట్లు కల వచ్చిన నవగ్రహములు, నక్షత్రములు, కనబడిన మంచి అభివృద్ధి కలిగి ధనలాభము, ఉద్యోగ లాభములు కలుగును.

నదులు, సముద్రములు దాటుట ఆకాశమున ఎగురుట, సూర్యుడు ఉదయించుట, మంటతో ఉన్న నిప్పు, కల్లు, సారాయి త్రాగుట, మాంసం తినుట, నీటి యందు ఉన్న చేపలు చూచుట మొదలగునవి కలలో వచ్చిన గౌరవము. కష్టములు తొలగిపోయి అభివృద్ధి చెందుట. కోర్టు వ్యవహారములందు జయము కలుగుట. ధనలాభములు కలుగును. ఆకాశము మబ్బుతో ఉండి వర్షము కురియక ఉరుములు మెరుపులతో ఉన్నచో ధనలాభము కలుగును. ఉద్యోగస్తులకు ఉద్యోగములో అభివృద్ధి. కోర్టు చిక్కులలో జయము. వివాహము కాని వారికి వివాహము జరుగును. విద్యార్థులు పరీక్షలలో జయము కలుగును. చేయి ప్రయత్నములు నెరవేరును. కష్టములు తొలుగును.

కలలో చేపలు, కప్పలు కలలో కనబడుట మంచిది తాబేలు కలలో కనబడిన దూరప్రాంతములకుపోయి ధనము సంపాదించెదరు.

పొలము దున్నుచున్నట్లు కీర్తియు, ఊరు మధ్య భాగమున విశాల వీధులయందు నడచిన సౌకర్యము కలిగి మాట పలుకుబడి పెరుగును. బాగుగా ఫలించిన పచ్చని భూములు మధ్య నడచిన అభివృద్ధి కలుగును.

పచ్చని గడ్డివోవు నెత్తి మీద పెట్టుకొని వెళ్ళినట్లు, కష్టములు తొలగును.

ధాన్యపు కంకులు కన్పించిన న్యాయార్జిత ధనము లభించును.

కుమ్మర గుంటలో పడినట్లు కల వచ్చిన విధవ స్త్రీ సాంగత్యము కలుగును.

కలలో శ్మశానం కనబడిన ధనలాభం కలుగును.

తను నూతన గృహ నిర్మాణము చేయు చున్నట్లు కల వచ్చిన కార్యజయము. తానే కట్టుచున్నట్లు వచ్చిన ధనలాభము కలుగును.

గోప, ఇల్లు, మేడ, నిచ్చిన వీటిని ఎక్కుచున్నట్లు కలవచ్చిన శుభవర్తమానము. అవి దాటినట్లు వచ్చిన కష్టములు తొలగిపోవును.

చెట్టు ఎక్కినట్లు కలవచ్చిన సుఖభోజనము. సంతోషం అభివృద్ధి.

❄ ❄ ❄ ❄ ❄



# తిరుక్కుఱళ్ - శ్రీవాణి

- డాక్టర్ గాలి గుణశేఖర్

ప్రిన్సిపల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అద్దంకి. సెల్ : 9618612495



## 20.వ్యర్థ ప్రసంగం

**191. పరులకు విసుగు పుట్ట నిష్ఫలపు మాట లాడ, నిందింతు రెప్పుడు అవని జనులు**
వింటున్న వారికి రోతపుట్టే విధంగా ప్రయోజనం లేని మాటల్ని పలికే వాణ్ని ప్రజలందరూ ఈసడించుకుంటారు.

**192. సఖులకహితములను సలుప కీ, దంతకు కీడు వ్యర్థ వాక్కు లాడుట యన**
ఆత్మీయులైన వారికి చేటు తలపెట్టడం కీడు. కాని అంతకంటె వ్యర్థంగా మాట్లాడటం కీడు.

**193. ఫలరహితములయిన పలుకు లధికమైన ధర్మహీనుడనగ తలచు పుడమి**
ప్రయోజనం లేని మాటల్ని (ఊకదంపుడు ఉపన్యాసాలు) ఎక్కువైతే అతను నీతిహీనుడిగా పరిగణింపబడతాడు.

**194. పలువురి కడ నయరహిత ఫలవిహీన వాక్కులాడ ధర్మము గాక వ్యర్థము లగు**
మంచివి కాని, ఫలితం లేని మాటల్ని పలువురిలో ప్రసంగిస్తూ ఉంటే అనర్థాలు కలిగించి, అన్ని ధర్మాలకు ఆ వ్యక్తిని దూరం చేస్తుంది.

**195. పేర్మి, మేలిమితో పోవు పెద్దలైన మంచివారు వ్యర్థంబుగ మాటలాడ**
గొప్పవారైన, సత్ప్రవర్తకులైనా వ్యర్థంగా మాట్లాడితే అప్పటి వరకు వారికున్న గౌరవం, గొప్పతనంతో బాటు నశిస్తుంది.

**196. కొడుకు కాడతండు కొరగాని వాడగు ఫలిత మిాని మాట పలుకు వాడు**
వ్యర్థంగా ప్రసంగించే వాడు కొడుకైనా, పనికిమాలిన వాడిగా భావించి విడిచి పెట్టాలి.

**197. ఆర్యులహిత వాక్కు లాడి మసలినను పాడి కాదు వ్యర్థ బాషణంబు**
గొప్పవాళ్ళు హితం కాని మాటలు మాట్లాడినా ఫరవాలేదు. కాని వ్యర్థంగా మాట్లాడడం ధర్మం కాదు.

**198. అరుదగు ఫలితముల నరయ గల వివేకి ఫలరహితము నెపుడు పలుక లేదు**
గొప్పఫలితాలను ఆశించి, ప్రవర్తించగల బుద్ధిమంతుడు వ్యర్థ ప్రసంగాలు చెయ్యడు.

**199. మరులు వీడి తేరు మహితాత్ము లెన్నడు పొరబడియు పలుకరు పొల్లు మాట**
మోహం విడిచి మచ్చలేక జీవించే మహామహులు పొరబాటున కూడ ప్రయోజనం లేని శబ్దాన్ని ఉచ్చరించరు.

**200. పలుక వలయు నెపుడు ఫలమిచ్చు వానిని ఫలవిహీనములను పలుకరాదు**
వ్యక్తి మాట్లాడాలని భావిస్తే ఎల్లప్పుడూ ఫలితమిచ్చే పలుకులే పలకాలి. అలా కాని మాటల్ని పరిహరించడం భావ్యం.

## 21. పాపభీతి

**201. దురితములను జేయ దుష్టుడు జంకడు సచ్చరితుడు చేయ జంకు గొనును**
చెడ్డపనులు చెయ్యడానికి గల అహం ఉన్న దుర్మార్గుడు అటువంటి పనులు చెయ్యడానికి భయపడడు. మంచివాడు చెడుపనులు చెయ్యాలన్న తలపుకైనా భయపడతాడు.

**202. చెడుగు పనులుచేయ చేటు గలుగు గాన జ్వాల గనిన భంగి జంక వలయు**
నిప్పును చూస్తే ఎంతభయపడతామో, అలాగే చెడ్డపనులు చెయ్యడానికి భయపడాలి.

**203. ఎరుకలన్నింటి ఉన్నతం బేది యనిన చెడుగరంబున కైన చెడు తలపమి**
క్రూరుడి పట్ల కూడా చెడు భావించకుండా ఉండడమే అన్ని జ్ఞానాల లోకి ఉత్తమ జ్ఞానం

**204. మరచి యేని చేయ దగదు పరులకు చెడు చేయ ధర్మమె యతనికి చేటానర్చు**
మరపున కూడా ఇతరులకు చెడు చెయ్యరాదు. అలా చేస్తే ధర్మదేవతే అతణ్ని శిక్షిస్తుంది.

**205. పేదనని యెంచి చెడు తలపెట్టరాదు పెరుగు నద్దాని కతమున పేదరికము**
పేదరికంలో ఉన్నామని, దరిద్రం పోగొట్టుకోవాలని చెడును ఇతరులకు చెయ్యరాదు. అందువల్ల పేదరికం మరింత పెరుగుతుందే కాని శుభం కలుగదు.

**206. చెడుగు వలన బాధ జెంద గోరని వాడు దాని నితరుల యెడ తలపరాదు**
పాపం చేసిన ఫలితాలు తన్ను చెందకూడదని భావించేవాడు చేటు కలిగించే చర్యలను చేపట్టరాదు.

**207. పగకలిగిన నడప తగు తెరవు గలదు చెడుగు వలని ఫలము చెరుపగాదు**
ఎంత శత్రుత్వం ఇతరులు తన పట్ల ప్రదర్శించినా, దాన్ని పోగొట్టుకోవడానికి మార్గం ఉంది. కాని చెడ్డ పనులు చెయ్యడం వల్ల కలిగే ఫలితాన్ని తప్పించుకోవడం సాధ్యం కాని పని.

**208. నీడ వెంబడించి వీడని రీతిగా చేటు వెంబడించు చెడు గొనర్ప**
నీడ ఎల్లప్పుడూ వెంబడించి, నిలిచి ఉన్నట్లే, చెడు పనుల వల్ల కలిగే అశుభం ఎల్లప్పుడూ వెన్నంటి ఉంటుంది.

**209. తన్ను దాను గాచి ధరమనవలెనన్న హాని కొంచెమైన నెంచరాదు**
తనను తాను రక్షించుకుంటూ జీవించాలంటే లవలేశం కూడా కీడు ను ఇతరుల పట్ల తలపెట్టరాదు.

**210. చెడుగొనర్పక పెడదారి నడవనపుడు కలుగదెప్పుడు కీడని తెలియనగును**
చెడ్డవనులు చెయ్యక సన్మార్గం విడిచిపెట్టకుండా జీవిస్తే ఎప్పుడూ కీడు కలుగదు.

❄ ❄ ❄ ❄ ❄